


VARTHAA SAKSHAMU

RNI.Title Code: APTEL/25/A5153

# వార్త సాక్ష్యం

తెలుగు దిన పత్రిక

Editor : SAGINALA RAVI KUMAR

హైదరాబాద్, విజయవాడ | సంపుటి : 01 | సంచిక : 90 | ఆదివారం 30 ఆగష్టు 2026 | పేజీలు : 8 | వెల : 2/-

## ప్రతి ఒక్కరికీ సంపూర్ణ ఆరోగ్యం.. రాష్ట్రవ్యాప్తంగా 'సంజీవని' అమలు



- అల్లూరి జిల్లాలో ఆరోగ్య రథాలను ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- రాష్ట్రవ్యాప్తంగా 'సంజీవని' కార్యక్రమం అమలుకు నిర్ణయం
- మారుమూల ప్రాంతాల్లో కనెక్టివిటీ కోసం సెల్ టవర్ల ఏర్పాటు
- ప్రతి కుటుంబానికి నాణ్యమైన వైద్యం అందించడమే లక్ష్యమన్న సీఎం

# ఓటర్ల తొలగింపు పై సీఈసీకి సీఎం రేవంత్ రెడ్డి లేఖ

- గడువు 4 వారాలు పొడిగించాలని విజ్ఞప్తి
- తెలంగాణలో 92.86 లక్షల ఓట్లు పోయాయన్న రేవంత్ రెడ్డి
- అర్హులైన వారు ఓటు కోల్పోకుండా సమగ్ర పరిశీలన జరపాలని విన్నపం
- ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు భద్రతను కల్పించాలన్న సీఎం



## నేపాల్ వరదల్లో కొట్టుకుపోయిన బ్యాంకు సేఫ్ లూటీ

- నగదు దోచుకున్నారన్న ఆరోపణల పై 29 మంది అరెస్ట్
- నిందితుల నుంచి రూ. 57 లక్షల విలువైన నేపాల్ కరెన్సీ స్వాధీనం
- వరద మృతురాలి చెవి కమ్మలు దొంగిలించిన ఇద్దరి అరెస్ట్



## భారత్‌తో ఘర్షణల నాటి జనరల్‌ను పదవుల నుంచి తొలగించిన చైనా

- గల్వాన్, డోక్లాం ఘర్షణల నాటి జనరల్‌పై చైనా వేటు
- పీఎల్‌ఏ మాజీ జనరల్ జావో జోంగ్కీని కీలక పదవుల నుంచి తొలగింపు
- ఎలాంటి అధికారిక కారణం వెల్లడించని బీజింగ్ ప్రభుత్వం
- సైన్యం పై పట్టు బిగించేందుకు జిన్‌పింగ్ చేపట్టిన ప్రక్షాళనలో భాగంగానే ఈ చర్యలు



## రేవంత్ రెడ్డి భాష పై ఎథిక్స్ కమిటీలో చర్చించాలి

- అసెంబ్లీలో రేవంత్ వాడుతున్న భాష పై ఎథిక్స్ కమిటీలో విచారణ జరపాలన్నవేముల
- అసెంబ్లీలో అనుచితంగా ప్రవర్తించిన వారి పై చైర్మన్ కు ఫిర్యాదు చేశామని వెల్లడి
- కౌశిక్ రెడ్డికి వివరణ ఇచ్చుకునే అవకాశం ఇవ్వాలని విన్నపం



## రాష్ట్ర కేబినెట్‌ను పునర్వ్యవస్థీకరించాలన్న మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

- కాంగ్రెస్ పార్టీలో వర్గపోరును అరికట్టి, క్రమశిక్షణ పెంచాలని సూచన
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అడ్డంకులు సృష్టించవద్దని హితవు
- పించన్లను రూ.3,000కు పెంచాలని ప్రభుత్వానికి సలహా
- ఉచితాలు క్రమంగా తగ్గించాలన్న గుత్తా సుఖేందర్ రెడ్డి



## 22ఏ భూముల సమస్యల పై పోరుబాట



- బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలతో రాంచందర్ రావు కీలక భేటీ
- మరో రెండు పోరాటాలకు రెడీ అవుతున్న తెలంగాణ బీజేపీ
- సెప్టెంబర్ 5, 6 తేదీల్లో 22 ఏ భూముల వ్యవహారం పై దీక్ష
- ఆదిలాబాద్నుంచి అసెంబ్లీ వరకు రైతు యాత్ర

## ఎవరూ హైదరాబాద్ రావద్దు, రెండు రోజుల్లో నేనే గుంటూరు వస్తా



- వైసీపీ నేత అంబటి రాంబాబుకు విజయవంతంగా స్టెంట్ల చికిత్స
- రొటీన్ చెకప్‌లో భాగంగా గుండెలో రెండు బ్లాకులు గుర్తింపు
- ప్రస్తుతం తన ఆరోగ్యం నిలకడగా ఉందని వెల్లడి
- హైదరాబాద్ రావద్దని, రెండు రోజుల్లో గుంటూరు వస్తానని కార్యకర్తలకు సూచన
- హైదరాబాద్ అపోలో ఆసుపత్రిలో ప్రత్యేక పర్యవేక్షణలో ఉన్న మాజీ మంత్రి

# ఓటర్ల తొలగింపు పై సీఈసీకి సీఎం రేవంత్ రెడ్డి లేఖ

తెలంగాణలో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై కేంద్ర ఎన్నికల కమిషనర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లేఖ రాశారు. ఈ సవరణ ప్రక్రియలో భాగంగా ఏకంగా 92.86 లక్షల ఓట్ల తొలగింపుకు సంబంధించిన నోటీసులు, పరిశీలనలు వెలువడటం పై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అర్హులైన పౌరులెవరూ ఓటు హక్కు కోల్పోకుండా చూసేందుకు సమగ్ర పరిశీలన అత్యవసరమని కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం నిర్ణయించిన గడువులోగా నోటీసులకు స్పందించడం, అభ్యంతరాలు నమోదు చేయడం, అవసరమైన ఆధార పత్రాలను సమర్పించడం సాధారణ పౌరులకు సవాలుగా మారిందని సీఎం పేర్కొన్నారు. ముఖ్యంగా ఉపాధి కోసం తాత్కాలికంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వలస కూలీలు, రోజువారీ కూలీలు తమ ఓటు హక్కును నిరూపించుకునేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ఈ నేపథ్యంలో ఓటర్ల నుంచి క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరించే సమయాన్ని మరో నాలుగు వారాల పాటు పొడిగించాలని లేఖలో స్పష్టంగా కోరారు. దీంతో పాటు, అత్యధికంగా ఓటర్ల సంఖ్య ఉన్న హైదరాబాద్, మేడ్చల్-మల్కాజ్‌గిరి, రంగారెడ్డి జిల్లాల్లో పరిశీలన ప్రక్రియ వేగంగా, పారదర్శకంగా సాగేందుకు అదనపు ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లను తక్షణమే నియమించాలని సూచించారు. గ్రామసభలు, పురపాలక వార్డుల్లో ఓటర్ల జాబితాను బిగ్గరగా చదివి వినిపించాలని, పట్టణ ప్రాంతాల్లో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేసి ఎస్ఐఆర్ ప్రక్రియను వికేంద్రీకరించడం ద్వారా ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

# ప్రతి ఒక్కరికీ సంపూర్ణ ఆరోగ్యం.. రాష్ట్రవ్యాప్తంగా 'సంజీవని' అమలు

రాష్ట్రంలోని ప్రతి ఒక్కరి సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఒక పటిష్ఠమైన వ్యవస్థను తీర్చిదిద్దుతున్నామని ఏపీ సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఇందులో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో 'సంజీవని' కార్యక్రమాన్ని ప్రారంభించారు. అరకులోయ మండలం గన్నెలలో ఆయన పర్యటించి, పలు 'ఆరోగ్య రథాల'ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా మారుమూల ప్రాంతాల్లోని ప్రజల ముంగిటకే నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. కొండ ప్రాంతాల్లోని ప్రజలు వైద్యం కోసం కిలోమీటర్ల కొద్దీ ప్రయాణించాల్సిన దుస్థితి ఉండకూడదన్నదే తన సంకల్పమని ఉద్ఘాటించారు. ఈ సమస్యను అధిగమించేందుకే 'సంజీవని' కార్యక్రమాన్ని రూపొందించామని, దీనిని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లోని ప్రతి కుటుంబానికీ నాణ్యమైన వైద్యం అందించడమే ప్రభుత్వ ధ్యేయమని వివరించారు. ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు యోగా, ధ్యానం వంటి కార్యక్రమాలను కూడా ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్య సేవలతో పాటు కనెక్టివిటీకి కూడా తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని చంద్రబాబు పేర్కొన్నారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లో సిగ్నల్ సమస్యను పరిష్కరించేందుకు సెల్ టవర్లను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. గతంలోనే అల్లూరి సీతారామరాజు ఈ ప్రాంత గిరిజనులకు ఆయుర్వేద వైద్యం అందించారని గుర్తుచేశారు. ఆ మహనీయుడిని నిత్యం స్మరించుకునేందుకే భోగాపురంలో కొత్తగా నిర్మించిన అంతర్జాతీయ విమానాశ్రయానికి 'అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం' అని నామకరణం చేసినట్లు వెల్లడించారు. గిరిజన బిడ్డలు థింసా నృత్యంతో గిన్నీస్ వరల్డ్ రికార్డు సృష్టించడంపై ఆయన హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

# 22ఏ భూముల సమస్యల పై పోరుబాట

తెలంగాణలో ప్రజా సమస్యలపై నిరంతరం గళమెత్తుతూ పార్టీని బలోపేతం చేసుకునే దిశగా బీజేపీ ముందుకు సాగుతోంది. ఇటీవల విద్యార్థుల ఫీజు బకాయిల చెల్లింపును డిమాండ్ చేస్తూ విజయవంతంగా దీక్ష నిర్వహించిన బీజేపీ నాయకత్వం... తాజాగా రాష్ట్ర ప్రభుత్వ విధివిధానాలకు వ్యతిరేకంగా మరో రెండు ప్రధాన పోరాటాలకు సన్నద్ధమవుతోంది. ఈ క్రమంలో నిషేధిత 22ఏ జాబితాలో చేర్చిన భూముల వ్యవహారంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న పేద, మధ్యతరగతి బాధితులకు అండగా నిలిచేందుకు వచ్చే నెల (సెప్టెంబర్) 5, 6 తేదీల్లో బీజేపీ నేతలు భారీ దీక్ష చేపడుతున్నారు. ఈ దీక్షా కార్యక్రమాన్ని విజయవంతం చేయడంపై చర్చించేందుకు ఈరోజు నిర్వహించిన సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు నేతృత్వంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొని భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. మరోవైపు, ఫసల్ బీమా పథకాన్ని రాష్ట్రంలో తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ లోని అసెంబ్లీ వరకు పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పాయల్ శంకర్ 'రైతు యాత్ర' చేపడుతున్నారు. తెలంగాణలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసేందుకు రాబోయే రోజుల్లో ఆందోళనలను మరింత తీవ్రతరం చేయనున్నట్లు బీజేపీ ప్రకటించింది.

# రేవంత్ రెడ్డి భాష పై ఎథిక్స్ కమిటీలో చర్చించాలి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో వాడుతున్న పదజాలం, అనుచిత వ్యాఖ్యల పై ఎథిక్స్ కమిటీలో విచారణ జరపాలని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి డిమాండ్ చేశారు. ఎథిక్స్ కమిటీ సమావేశంలో ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ తరఫున తమ వాదనను ఎంతో బలంగా వినిపించామని వెల్లడించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వ్యాఖ్యల వివాదం జరిగిన రోజు కేవలం కాంగ్రెస్‌కు చెందిన 23 మంది ఎమ్మెల్యేలతోనే సభలో మాట్లాడించారని... అది ఏ విధంగా 'మూడ్ ఆఫ్ ది హౌస్' అవుతుందని ప్రశాంత్ రెడ్డి ప్రశ్నించారు. కేవలం కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల ఏకపక్ష మాటలను ప్రాతిపదికగా చేసుకుని, కౌశిక్ రెడ్డి అంశాన్ని ఎథిక్స్ కమిటీ ఎజెండాలో చేర్చడం సభా సంప్రదాయాలకు విరుద్ధమని దుయ్యబట్టారు. సభా నాయకుడిగా ఉన్న సీఎం రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు, అధికార పార్టీ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో అనుచితంగా ప్రవర్తించడంపై చర్యలు తీసుకోవాలని ఎథిక్స్ కమిటీ చైర్మన్‌కు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశామని తెలిపారు. రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, వీర్లపల్లి శంకర్, మందుల శామ్యూల్‌లు సభలో చేసిన అసభ్య వ్యాఖ్యలు, అనుచిత హావభావాల వీడియో ఆధారాలను కూడా కమిటీకి సమర్పించామని వివరించారు. ఈ విజ్ఞప్తిపై క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని చైర్మన్ హామీ ఇచ్చారని పేర్కొన్నారు. అలాగే పాడి కౌశిక్ రెడ్డికి తన వివరణ ఇచ్చుకునే సరైన అవకాశం ఇవ్వాలని కోరామన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు అసెంబ్లీలో సహకరించుకుంటున్నాయని కాంగ్రెస్ నేతలు చేస్తున్న ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని ఆయన కొట్టిపారేశారు. మంత్రి కొండా సురేఖ వ్యవహారంలో ఏం జరుగుతుందో స్పష్టత లేదని, రాజకీయాల్లో ఏదైనా జరగొచ్చని వ్యాఖ్యానించారు.

# రాష్ట్ర కేబినెట్‌ను పునర్వ్యవస్థీకరించాలన్న మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గంలో మార్పులు చేపట్టాల్సిన అవసరం ఉందని శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అభిప్రాయపడ్డారు. కేబినెట్ పునర్వ్యవస్థీకరణ ద్వారా ప్రభుత్వం పనితీరులో నూతనోత్తేజం వస్తుందని ఆయన పేర్కొన్నారు. హైదరాబాద్‌లో మీడియాతో పిచ్చాపాటిగా మాట్లాడిన ఆయన, కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలను అరికట్టి, క్రమశిక్షణను కఠినంగా అమలు చేయాలని సూచించారు. ప్రస్తుతం రాజకీయ పార్టీలలో క్రమశిక్షణ కొరవడిందని గుత్తా వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీలోని గ్రూపు రాజకీయాలకు స్వస్తి పలకాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. సీనియర్ నేత చిన్నారెడ్డి పార్టీ నియమావళిని అతిక్రమించి మాట్లాడటం సరికాదని, హద్దులు దాటే వారిపై చర్యలు తీసుకోకపోతే పార్టీకే నష్టం వాటిల్లుతుందని హెచ్చరించారు. ప్రభుత్వం, పార్టీ సంస్థాగత వ్యవహారాల్లో సమాచార లీకేజీలను అదుపు చేయాలని ఆయన కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యువకుడు, ఉత్సాహవంతుడని, ఆయనకు ఎటువంటి ఆటంకాలు సృష్టించకుండా స్వేచ్ఛగా పనిచేసే అవకాశం కల్పించాలని గుత్తా సుఖేందర్ రెడ్డి హితవు పలికారు. ప్రస్తుతం ప్రభుత్వంపై సామాన్య ప్రజల్లో పెద్దగా వ్యతిరేకత లేదని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలను కొనసాగిస్తూనే, ప్రభుత్వం నూతన పథకాలను అమలు చేస్తోందని, అయితే ప్రభుత్వ కార్యక్రమాలకు మరింత ప్రచారం కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. సంక్షేమ పథకాలపై స్పందిస్తూ, ప్రస్తుతం ఇస్తున్న పింఛన్లను రూ. 3,000కు పెంచాలని, 22ఏ నిబంధనను రద్దు చేసి సంబంధిత సమస్యలను పరిష్కరించాలని కోరారు. అలాగే ఉచిత పథకాలను క్రమంగా తగ్గించాలని ఆయన ప్రభుత్వానికి సూచించారు.

# మమతపై ఎఫ్ఐఆర్ నమోదు చేయండి.. సీఎం సువేందు అధికారి సంచలన ఆదేశాలు

పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో మరోసారి తీవ్ర ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. మాజీ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ప్రస్తుత ముఖ్యమంత్రి సువేందు అధికారి నేడు ఆదేశాలు జారీ చేశారు. కోర్టు ఆదేశాలను ధిక్కరించినందుకు ఈ చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసులను ఆదేశించడం రాజకీయంగా ప్రకంపనలు సృష్టిస్తోంది. తృణమూల్ కాంగ్రెస్ విద్యార్థి విభాగం (టీఎంసీపీ) వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా నిన్న కోల్‌కతా నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి కలకత్తా హైకోర్టు కొన్ని షరతులతో కూడిన అనుమతి ఇచ్చింది. అందులో ముఖ్యంగా రహదారిపై ఒక లేన్‌ను పూర్తిగా ట్రాఫిక్‌కు వదిలిపెట్టి, మరో లేన్‌లో మాత్రమే ర్యాలీ నిర్వహించాలని స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. అయితే, ఈ నిబంధనలను పూర్తిగా ఉల్లంఘించి ర్యాలీ నిర్వాహకులు రెండు లేన్లను దిగ్బంధించారని ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ ఉల్లంఘనలపై ముఖ్యమంత్రి సువేందు అధికారి తీవ్రంగా స్పందించారు. మీడియాతో మాట్లాడుతూ.. "కోర్టు ఆదేశాలను ఉల్లంఘించిన తీరు స్పష్టంగా కనిపించింది. రహదారిలో ఒక లేన్‌ను ఖాళీగా ఉంచాలని కోర్టు చెప్పినా, మాజీ ముఖ్యమంత్రి ప్రజలను సమీకరించి రెండు లేన్లనూ మూసివేశారు. ఈ విషయంలో తక్షణమే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని పోలీసులను ఆదేశించాను. దీనిపై కలకత్తా హైకోర్టును కూడా ఆశ్రయించాలని సూచించాను. ఈ వ్యవహారాన్ని తేలిగ్గా వదిలిపెట్టే ప్రసక్తే లేదు" అని సువేందు అధికారి స్పష్టం చేశారు. సువేందు అధికారి ఆరోపణలకు పశ్చిమ బెంగాల్ అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా ఉన్న రితబ్రత బెనర్జీ కూడా మద్దతు పలికారు. ర్యాలీలో పాల్గొనేవారి సంఖ్యపై కూడా కోర్టు పరిమితులు విధించిందని, వాటిని కూడా పట్టించుకోలేదని ఆయన విమర్శించారు. బారికేడ్లను తొలగించి రోడ్డంతా ఆక్రమించాలని మమతా బెనర్జీ తన అనుచరులను రెచ్చగొట్టడం కనిపించిందని ఆయన ఆరోపించారు. కాగా, నిన్న జరిగిన ర్యాలీలో మమతా బెనర్జీ.. అధికార బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రస్తుత ప్రభుత్వ అరాచకాలే రాబోయే రోజుల్లో తృణమూల్ కాంగ్రెస్‌ను తిరిగి అధికారంలోకి తీసుకువస్తాయని ఆమె ధీమా వ్యక్తం చేశారు. అయితే, సువేందు అధికారి తాజా ఆదేశాలపై మమతా బెనర్జీ వర్గం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక స్పందన రాలేదు.

## ఎవరూ హైదరాబాద్ రావద్దు, రెండు రోజుల్లో నేనే గుంటూరు వస్తా

వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు తన ఆరోగ్య పరిస్థితిపై స్వయంగా స్పందించారు. సాధారణ ఆరోగ్య పరీక్షల్లో భాగంగా తన గుండెలో రెండు బ్లాకులు గుర్తించారని, వైద్యుల బృందం విజయవంతంగా స్టెంట్లు వేసి చికిత్స పూర్తి చేసిందని ఆయన తెలిపారు. తనను పరామర్శించేందుకు ఎవరూ హైదరాబాద్ రావద్దని, రెండు రోజుల్లో తానే గుంటూరుకు తిరిగి వస్తానని, అక్కడే అందరం కలుసుకుందామని పార్టీ శ్రేణులకు, అభిమానులకు విజ్ఞప్తి చేశారు. వివరాల్లోకి వెళితే, శుక్రవారం అంబటి రాంబాబు స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. దీంతో కుటుంబ సభ్యులు ఆయన్ను మెరుగైన వైద్యం కోసం హుటాహుటిన హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ఆయనకు అవసరమైన అన్ని పరీక్షలు నిర్వహించారు. యాంజియోగ్రామ్ చేసిన అనంతరం, గుండె రక్తనాళాల్లో రెండు బ్లాకులు ఉన్నట్లు నిర్ధారించి, స్టెంట్లు వేయాలని నిర్ణయించారు. ఈ ప్రక్రియను వైద్య బృందం విజయవంతంగా పూర్తి చేసింది. ప్రస్తుతం అంబటి రాంబాబు ఆరోగ్యం నిలకడగా ఉందని, ఆయన వైద్యుల ప్రత్యేక పర్యవేక్షణలో ఉన్నారని ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. ఆందోళన చెందాల్సిన అవసరం ఏమీ లేదని స్పష్టం చేశాయి. ఈ వార్త తెలియడంతో తొలుత వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ఆయన అభిమానులు ఆందోళనకు గురయ్యారు. అయితే, చికిత్స విజయవంతం కావడం, ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని తెలియడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

## భారత్‌తో ఘర్షణల నాటి జనరల్‌ను పదవుల నుంచి తొలగించిన చైనా

భారత్ సరిహద్దుల్లో ఉద్రిక్తతలు నెలకొన్న సమయంలో కీలక బాధ్యతలు నిర్వర్తించిన పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పీఎల్ఏ) మాజీ జనరల్ జావో జోంగ్కీపై చైనా ప్రభుత్వం వేటు వేసింది. దేశంలోని అత్యున్నత రాజకీయ సలహా మండలి సభ్యత్వంతో పాటు ఆయన నిర్వహిస్తున్న ఇతర కీలక రాజకీయ పదవుల నుంచి జీవోను తొలగించింది. 2017లో జరిగిన డోక్లాం ప్రతిష్టంభన, 2020 నాటి గల్వాన్ లోయ ఘర్షణల సమయంలో జావో జోంగ్కి పీఎల్ఏ వెస్ట్రన్ థియేటర్ కమాండ్‌కు అధిపతిగా వ్యవహరించారు. చైనీస్ పీపుల్స్ పొలిటికల్ కన్సల్టేటివ్ కాన్ఫరెన్స్ స్టాండింగ్ కమిటీ ఆగస్టు 26న సమావేశమై జావోను పదవుల నుంచి తొలగించాలని ఓటింగ్ ద్వారా నిర్ణయించింది. జాతీయ కమిటీ సభ్యత్వంతో పాటు, జాతి, మతపరమైన వ్యవహారాల కమిటీ డిప్యూటీ డైరెక్టర్ పదవి నుంచి కూడా ఆయన్ను తప్పించారు. అయితే, ఈ నిర్ణయానికి గల కారణాలను చైనా ప్రభుత్వం అధికారికంగా వెల్లడించలేదు. ఆయనపై ఎటువంటి విచారణకు ఆదేశించినట్లు కూడా ఇప్పటివరకు ప్రకటించకపోవడం గమనార్హం. భారత్‌తో సరిహద్దు వ్యవహారాలను పర్యవేక్షించే వెస్ట్రన్ థియేటర్ కమాండ్‌కు 2016లో తొలి కమాండర్‌గా జావో నియమితులయ్యారు. ఆయన పదవీకాలంలోనే 2017లో 73 రోజుల పాటు డోక్లాం ప్రతిష్టంభన కొనసాగింది. అలాగే 2020లో 20 మంది భారత సైనికులు వీరమరణం పొందిన గల్వాన్ ఘర్షణలు కూడా ఆయన పర్యవేక్షణలోనే జరిగాయి. అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ సైన్యంలో చేపట్టిన భారీ ప్రక్షాళనలో భాగంగానే ఈ చర్యలు తీసుకున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. ఇటీవలే తీవ్రమైన క్రమశిక్షణా ఉల్లంఘనల ఆరోపణల నేపథ్యంలో జనరల్ జాంగ్ యోక్సియా, లియు జెన్లీలను కూడా సెంట్రల్ మిలిటరీ కమిషన్ నుంచి తొలగించారు. సైన్యం పై తన పట్టును మరింత బిగించుకునే క్రమంలోనే జిన్‌పింగ్ వరుసగా ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి.

## నేపాల్ వరదల్లో కొట్టుకుపోయిన బ్యాంకు సేఫ్ లూటీ

నేపాల్‌ను అతలాకుతలం చేస్తున్న భారీ వరదల వేళ మానవత్వం సిగ్గుపడే హేయమైన ఘటనలు వెలుగులోకి వచ్చాయి. వరదల్లో కొట్టుకువచ్చిన ఓ బ్యాంకు సేఫ్టీ లాకర్ ను పగలగొట్టి, అందులోని నగదును అపహరించిన ఆరోపణలపై పోలీసులు 29 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 92,68,505 నేపాలీ రూపాయలను (సుమారు రూ. 57 లక్షలు) స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం, రసువా జిల్లాలోని భోటేకోషి ప్రాంతంలో వరద ఉద్ధృతికి ఓ బ్యాంకు సేఫ్టీ లాకర్ కొట్టుకుపోయింది. అది ధాడింగ్ జిల్లా పరిధిలోని త్రిశూలి నది సమీపంలో స్థానికులకు కనిపించింది. అయితే, కొందరు వ్యక్తులు ఆ లాకర్ ను బలవంతంగా తెరిచి, అందులోని నగదును పంచుకున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే రంగంలోకి దిగిన ప్రత్యేక బృందం గాలింపు చర్యలు చేపట్టి 29 మందిని అరెస్టు చేసింది. నిందితుల్లో 19 నుంచి 49 ఏళ్ల మధ్య వయసు వారు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. మరో అమానవీయ ఘటనలో, నారాయణి నదిలో లభ్యమైన ఓ వరద మృతురాలి మృతదేహం నుంచి బంగారు చెవి కమ్మలను ఇద్దరు వ్యక్తులు దొంగిలించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో పోలీసులు నిందితులను గుర్తించి అరెస్ట్ చేయడం తెలిసిందే. నేపాల్-టిబెట్ సరిహద్దు సమీపంలో హిమానీనదం (గ్లేసియర్) విస్ఫోటనం చెందడంతో ఈ భారీ వరదలు సంభవించాయి. ఈ ప్రకృతి వైపరీత్యం కారణంగా ఇప్పటివరకు వందలాది మంది మరణించగా, వేలాది మంది గల్లంతయ్యారని నేషనల్ డిజాస్టర్ రిస్క్ రిడక్షన్ అండ్ మేనేజ్‌మెంట్ అథారిటీ శనివారం వెల్లడించింది.

# సంపాదకీయం

## జోడీ కోసం.. వేలసార్లు పాట పాడి...!



ఒకప్పుడు హవాయిలోని కౌయై అడవుల్లో ఒక అందమైన, అరుదైన పక్షి జీవించేది. దాని పేరు కౌయై ఓఓ . నల్లని శరీరం పసుపు రంగు ఈకలతో ప్రత్యేకమైన రూపం దానిది. అంతకంటే ప్రత్యేకమైనది దాని మధురమైన స్వరం. ఒకప్పుడు ఈ పక్షుల పాటలతో కౌయై అడవులు మారుమోగేవి. ఆ పాటలు ఆ అడవికి సహజ సంగీతంలా ఉండేవి. ఇప్పుడు ఆ పక్షి లేదు.. అంతరించిపోయింది. కౌయై ఓఓ పక్షి అంతరించిపోవడానికి అనేక కారణాలు ఉన్నాయి. మనుషుల కార్యకలాపాల వల్ల అడవులకు నష్టం జరిగి దాని సహజ ఆవాసాలు తగ్గిపోయాయి. ఆహారం, గూడు కట్టుకునే ప్రదేశాలు క్రమంగా తగ్గిపోయాయి. రెండో కారణం, మనుషులు హవాయికి తీసుకువచ్చిన ఎలుకలు, పిల్లులు వంటివి ఈ పక్షులను, వాటి గుడ్లను వేటాడాయి. మూడవది హవాయికి పరిచయం లేని దోమలు కొత్తవ్యాధులను వ్యాపింపజేశాయి. ముఖ్యంగా ఏవియన్ మలేరియా వంటివి స్థానిక పక్షుల సంఖ్యను తీవ్రంగా తగ్గించాయి. ఇవేకాకుండా ప్రకృతి వైపరీత్యాలు అడవులను, ఆహార వనరులను దెబ్బతీశాయి. దీనితో పక్షుల సంఖ్య క్రమంగా తగ్గుతూ వచ్చింది. పక్షులకు వాటి సంఖ్య తగ్గిపోవడంతో జోడీని కనుగొనడం, సంతానం పెంచుకోవడం మరింత కష్టమైంది. చివరికి మిగిలింది... ఒకే ఒక్క పక్షి. 1981లో ఒక మగ కౌయై ఓఓను పరిశోధకులు గుర్తించారు. అలా... ఒకప్పుడు వందలాది పక్షుల పాటలతో నిండిన ఆ అడవిలో, చివరికి ఒక మగ కౌయై ఓఓ మాత్రమే మిగిలింది.అది తన జోడీని ఆకర్షించేందుకు పాట పాడేది. ఒక్కసారి కాదు.. అనేక వేలసార్లు అడవిలోని చెట్ల మధ్య తన పాటను మళ్లీ మళ్లీ వినిపిస్తూ, మరో పక్షి స్పందన కోసం ఎదురుచూసేది. కానీ, అప్పటికే దాని జాతి అంతరించిపోయింది. ఆ విషయం ఈ ఒంటరి మగ పక్షికి తెలియదు. తన చుట్టూ వందలుగా వినిపించిన తన జాతి స్వరాలు ఇక ఎప్పటికీ వినిపించవని దానికి తెలియదు. తన కోసం ఎదురుచూసే ఆడ పక్షి ఇక ఈ భూమిమీద లేనేలేదని కూడా దానికి తెలియదు. అందుకే అది తనకు తెలిసిన ఒక్క పని నిరంతరం చేస్తూనే ఉండేది... పాడటం. తోడుకోసం... తన జీవిత భాగస్వామి కోసం... తన పాటకు స్పందించే మరో స్వరం కోసం... అలా పాడుతూనే ఉంది. రోజులు గడిచాయి, ఋతువులు మారాయి, ఆ పక్షి మాత్రం, ప్రతి రోజూ తన జాతికి చెందిన మరో పక్షి వస్తుందన్న ఆశతో అలా పాడుతూనే ఉండేది. ఒక పిలుపు... మరో పిలుపు కోసం. సమాధానం రాలేదు. ఎంత గట్టిగా పాడినా... ఎంతసేపు పాడినా... ఎంతకాలం ఎదురు చూసినా... సమాధానం మాత్రం నిశ్శబ్దమే. చివరికి మిగిలింది... తన జాతి అంతరించిపోయిందనే విషయం తెలియక, తన చివరి తోడుకోసం జీవితాంతం పాడిన ఆ ఒంటరి స్వరం మాత్రమే. కొన్ని పాటలకు శ్రోతలు ఉండరు. కొన్ని పిలుపులకు సమాధానాలు ఉండవు. మరి కొన్ని జీవుల కథ నిశ్శబ్దంలోనే ముగుస్తుంది.1987లో ఆ పక్షి స్వరాన్ని పరిశోధకులు రికార్డు చేశారు. వారు ఆ రికార్డింగ్‌ను అడవిలో ప్లే చేస్తూ తిరిగారు. ఎక్కడైనా మరో కౌయై ఓఓ కనిపిస్తుందేమో, స్పందిస్తుందేమో అని ఆశగా అనేక సంవత్సరాల పాటు వెతికారు. కానీ, వారికి వినిపించిన ఆ పక్షిపాట వారి రికార్డర్‌లోనిదే. అడవి నుంచి మాత్రం సమాధానం రాలేదు. ఈ పిలుపునకు స్పందించే మరో కౌయై ఓఓ ఈ ప్రపంచంలో ఇక లేదన్న వాస్తవం క్రమక్రమంగా పరిశోధకులకు స్పష్టమైంది. ఆ పాటకు సమాధానం ఇక ఎప్పటికీ రాకపోవచ్చని వారికి అర్థమైంది. ఇక చివరకు మిగిలింది నిశ్శబ్దమే. ఒకప్పుడు వందలాది పక్షుల పాటలతో నిండిన ఆ అడవి... ఒకే ఒక్క పక్షి స్వరాన్ని విని... చివరికి మౌనంగా నిలిచిపోయింది. అలా మనిషి చేసిన తప్పుకు మరో జాతి బలి అయిపోంది.ఈ పక్షి అంతరించిపోవడం వెనుక అడవుల నాశనం, ఆవాసాలు కోల్పోవడం, మనిషి ప్రవేశపెట్టిన జంతువులు, వ్యాధులు, ప్రకృతి వైపరీత్యాలు వంటి అనేక కారణాలు ఉన్నాయి. కానీ వీటి వెనుక ఉన్న ఒక పెద్ద సమస్యను కూడా మనం మర్చిపోకూడదు. మనిషి తన అవసరాలకు మించి ప్రకృతిపై చూపిన ఒత్తిడి, జోక్యం. అడవులు మనకు కావాలి, భూమి కావాలి, వనరులు కావాలి. కానీ అదే అడవి జీవనాధారంగా ఉన్న ప్రాణులకు జీవించే హక్కు ఉందని మనం మర్చిపోయాం. ఈ రోజు కౌయై ఓఓ లేదు. దాని పాట ఇక వినిపించదు. మిగిలింది కేవలం పుస్తకాలలో దాని పేరు, పరిశోధనా పత్రాల్లో దాని గురించిన కొన్ని పంక్తులు. రికార్డింగ్‌లో దాని పాట మనిషి చేసిన తప్పులకు ఎన్నటికీ చెరగని గుర్తు. ఒక జాతి నాశనం కావడం అంటే, ప్రకృతి చరిత్రలో ఒక ప్రత్యేక అధ్యాయాన్ని శాశ్వతంగా చెరిపివేయడం. అంతరించిపోవడం ఒక్కసారిగా జరగదు. అడవి కొంచెం కొంచెంగా తరుగుతుంది.. జంతువులు క్రమక్రమంగా తగ్గుతాయి... వాటి గొంతులు ఒక్కొక్కటిగా నిశ్శబ్దమవుతాయి. చివరికి మిగిలేది-- 'ఒకప్పుడు ఇక్కడ ఒక పక్షి ఉండేది...'. ఒక జాతి అంతరించిపోయిన తర్వాత, మన దగ్గర ఎంత డబ్బు ఉండి ఏమి ప్రయోజనం? దాన్ని తిరిగి తీసుకురాలేం. ప్రకృతిని కోల్పోయిన తర్వాత సంపదతో దాన్ని కొనలేం. కౌయై ఓఓ వదిలి వెళ్లిన సందేశం ఒక్కటే-- మనిషి దురాశకు హద్దు లేకపోతే.. ఒక రోజు ప్రకృతిలో చివరకు మిగిలేది నిశ్శబ్దమే..!

## మతిస్థిమితం లేని వ్యక్తిపై మానవత్వం చాటుకున్న కమ్యూనిస్టు తిరుమలయ్య







ఆగస్టు 29 వార్త సాక్ష్యం

పట్టణంలో మతిస్థిమితం లేని ఓ వ్యక్తి పట్ల కమ్యూనిస్టు నాయకుడు తిరుమలయ్య శనివారం మానవత్వం చాటుకున్నారు. రోడ్డుపై అనాథగా, దీనస్థితిలో ఉన్న వ్యక్తిని గమనించిన తిరుమలయ్య అతడికి ఆహారం, దుస్తులు అందించి ఆదుకున్నారు. అనంతరం అతడి పరిస్థితిని తెలుసుకుని అవసరమైన సహాయం అందించేందుకు ముందుకు వచ్చారు. సమాజంలో ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అంటూ తిరుమలయ్య పేర్కొన్నారు. ఆయన చూపిన మానవతా దృక్పథాన్ని స్థానికులు కమ్యూనిస్ట్ పూర్ణకంటి తిరుమలయ్య అభినందించారు.

## జిల్లా స్థాయి సైన్స్ నాటకోత్సవాల్లో దుగినవెల్లి విద్యార్థుల ప్రతిభ



ఆగస్టు 29 వార్త సాక్ష్యం :

నల్గొండలోని డిఐఈటి (డైట్) లో నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ డ్రామా ఫెస్టివల్ పోటీలలోమండలంలో ని దుగినవెల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు చక్కటి ప్రతిభను కనబరిచి ద్వితీయ బహుమతి కైవసం చేసుకున్నారు. విజ్ఞాన శాస్త్ర అంశాలను, సామాజిక అవగాహనను జోడిస్తూ విద్యార్థులు ప్రదర్శించిన నాటకం న్యాయ నిర్ణేతలతో పాటు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. సృజనాత్మకత, అద్భుత నటనతో అలరించిన విద్యార్థులు తమ పాఠశాలకు, గ్రామానికి మంచి గుర్తింపు తెచ్చారు. జిల్లా స్థాయిలో ద్వితీయ బహుమతి సాధించిన విద్యార్థులను, ఉపాధ్యాయులను డైట్ అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, గ్రామ ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు అభినందిం చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పబ్బతి వెంకటరమణ, ఉపాధ్యాయులు టి.కరుణాదేవి, మిట్టపల్లి మురళయ్య, డి. శ్రీనివాసరావు, వి.వెంకట్ రెడ్డి, సలీం విద్యార్థులు ప్రణీత, జోష్ణవి, జాహ్నవి, నాగశ్రీ, నందిని,సరిత, పల్లవి, ప్రీతి రేణుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## బోధనా పద్ధతుల మార్పిడితోనే నాణ్యమైన విద్య

-ఆర్‌జేడీ ఎం. సోమిరెడ్డి



ఆగస్టు 29 వార్త సాక్ష్యం :

ఉపాధ్యాయులు పరస్పరం వినూత్న బోధనా అనుభవాల ను పంచుకోవడం ద్వారా విద్యార్థులకు మరింత మెరుగైన, నాణ్యమైన విద్యను అందించవచ్చని పాఠశాల విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్‌జేడీ) ఎం.సోమిరెడ్డి తెలిపారు. శనివారం నల్గొండ జిల్లా కట్టంగూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఇంగ్లీష్ కాంప్లెక్స్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలకు ఎక్కువగా పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లలే వస్తారని, వారిని ఉన్నతమైన పౌరులుగా తీర్చిదిద్దే గురుతర బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు మార్గదర్శకులుగా, స్నేహితులుగా నిలిచి చదువుతో పాటు నైతిక విలువలను అందించాలని సూచించారు. పాఠశాలల్లో ఎఫ్‌ఎల్ఎన్, ఎల్ఐపీతో పాటు గుణాత్మక విద్యా కార్యక్రమాలను పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని 9, 10 తరగతి విద్యార్థులతో ఆర్‌జేడీ ప్రత్యేకం గా మాట్లాడారు. తెలుగు, గణితం, సైన్స్ అంశాలకు సంబంధించి పలు ప్రశ్నలను బోర్డుపై రాయించి, విద్యార్థుల అభ్యసన స్థాయిలను స్వయంగా పరిశీలించారు. విద్యార్థులు చదువుపైనే పూర్తి దృష్టి సారించేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులను కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంబటి అంజయ్య మాట్లాడుతూ, బేస్‌లైన్ పరీక్షల ఆధారంగా అభ్యసనంలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారి కోసం ఉపాధ్యాయులు రోజూ ఒక గంట అదనంగా పనిచేస్తూ ప్రత్యేక బోధన అందిస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో కట్టంగూర్, శాలిగౌరారం, నకిరేకల్, కేతేపల్లి మండలాలకు చెందిన ఆంగ్ల ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## నర్రవాడలో శ్రీ వెంగమాంబ అమ్మవారిని దర్శించుకున్న మంత్రులు, ఎమ్మెల్యే

# టీడీపీ ప్రభుత్వ రెండేళ్ల పాలనపై ఇంటింటి ప్రచారం





ఆగస్టు 29 వార్త సాక్ష్యం :

నెల్లూరు జిల్లా నర్రవాడ గ్రామంలో వెలసి ఉన్న శ్రీ వెంగమాంబ అమ్మవారిని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, నెల్లూరు జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎండీ ఫరూక్, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి " రెండేళ్ల నమ్మకం -- అభివృద్ధి, సంక్షేమం -- ఇంటింటికి తెలుగుదేశం" కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యే పాల్గొన్నారు. గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిం చారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వం లోని కూటమి ప్రభుత్వం పనిచే స్తోందని వారు తెలిపారు. గత రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజలకు కలిగిన ప్రయోజ నాలను వివరించి, ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని మరింత బలోపేతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి పరిశీలకులు కందుల ఓబుల్ రెడ్డి మాజీ జిల్లా పరిషత్ అధ్యక్షులు చెంచాల బాబు, మాజీ ఎమ్మెల్యే కంభం విజయరాఘవారెడ్డి, మండల కన్వీనర్ ఉండేలా. గురువారెడ్డి,మల్లంపాటి గురవ య్య, జిల్లా అధికార ప్రతినిధి చీద్దెరల మల్లికా ర్జున, మాజీ ఎంపీపీ శ్రీకూర్తి రవీంద్రబాబు, స్థానిక టీడీపీ నాయకులు,కార్యకర్తలు,ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మాజీ ఎంపీ నందమూరి హరికృష్ణకు ఘన నివాళులు







ఆగస్టు 29 వార్త సాక్ష్యం

ఉదయగిరి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాజీ ఎంపీ, సినీ నటుడు నందమూరి హరికృష్ణ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎండీ ఫరూక్, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పాల్గొన్నారు. నందమూరి హరికృష్ణ గారి సేవలను, తెలుగుదేశం పార్టీ కోసం ఆయన చేసిన కృషిని వారు స్మరించుకున్నారు. పార్టీ పట్ల నందమూరి హరికృష్ణకు ఉన్న అంకితభావం, నాయకత్వ లక్షణాలు, ప్రజలతో ఆయనకు ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం పనిచేయాలని నేతలు పేర్కొన్నారు.

# క్షేత్రస్థాయిలో జనసేన బలోపేతానికి కృషి:మంత్రి కందుల దుర్గేష్





-మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ హాల్లో నిర్వహించిన జనసేన ఆత్మీయ సమావేశం
-జనసేనాని పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా పార్టీ బలోపేతం

అమరావతి/మంగళగిరి: ఆగస్టు 29 వార్త సాక్ష్యం

జనసేన పార్టీ అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేస్తామని, నాయకత్వాన్ని మరింత పెంపొందిస్తామని, పార్టీ శ్రేణులను రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సంసిద్ధం చేస్తామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ హాల్లో నిర్వహించిన జనసేన ఆత్మీయ సమావేశంలో మంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారు. అంతకుముందు జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్ అధ్యక్షతన స్థానిక సంస్థల ఎన్నికలపై నిర్వహించిన ప్రత్యేక కమిటీ సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సమావేశంలో స్థానిక ఎన్నికల విధివిధానాలు, అనుసరించాల్సిన వ్యూహాలపై కమిటీ సభ్యులు సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా జనసేనాని పవన్ కళ్యాణ్ సందేశాన్ని, పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసే అంశాలను మంత్రి నాదెండ్ల మనోహర్ కమిటీకి వివరించారు. అనంతరం మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ..త్వరలోనే క్షేత్రస్థాయిలో పర్యటించి పార్టీ కార్యకర్తలను, శ్రేణులను కలిసి వారికి పూర్తి భరోసా కల్పిస్తామని, ఎన్నికల పోరాటానికి సమాయత్తం చేస్తామని తెలిపారు. స్థానిక ఎన్నికల్లో పొత్తు ధర్మాన్ని నిష్పక్షపాతంగా పాటిస్తూ, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా పోటీపై ప్రత్యేక దృష్టి సారిస్తామని వెల్లడించారు.పార్టీ అధినేత పవన్



కళ్యాణ్ సూచించినట్లుగా కులమతాలు, ప్రాంతాలకు అతీతంగా అందరినీ భాగస్వాములను చేస్తూ సెప్టెంబర్ నెలలో పార్టీ బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ఈ ఆత్మీయ సమావేశంలో భాగంగా తూర్పుగోదావరి జిల్లా, ఎన్టీఆర్ జిల్లాతో పాటు నిడదవోలు నియోజకవర్గ జనసేన ముఖ్య నేతలు, కార్యకర్తలు మంత్రి కందుల దుర్గేష్ ను కలిసి మాట్లాడారు..పార్టీశ్రేణులతో మంత్రి దుర్గేష్ ఆద్యంతం ఉత్సాహంగా గడిపారు.

# పుల్లారెడ్డి హైస్కూల్లో ఘనంగా తెలుగు భాషా - క్రీడా దినోత్సవ వేడుకలు

-తెలుగు భాషను పరిరక్షించుకోవాలి హెచ్ఎం చాంద్ బాషా

ఆత్మకూరు ఆగస్టు 29 వార్త సాక్ష్యం

పట్టణంలో ని పుల్లారెడ్డి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో తెలుగు భాషా క్రీడా దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయుడు చాంద్ బాషా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముందుగా గిడుగు వెంకట రామమూర్తి, మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భ ంగా హెచ్ఎం చాంద్ బాషా మాట్లాడుతూ తెలుగు భాష ప్రాముఖ్యతను విద్యార్థులు తెలుసుకోవాలని మాతృభాషను ఎప్పటికీ మరువరాదని సూచించారు. తెలుగు భాషను ప్రజలకు సులభతరం చేయడంలో గిడుగు వెంకట రామమూర్తి చేసిన సేవలు చిరస్మరణీ యమన్నారు. అలాగే మేజర్ ధ్యాన్‌చంద్ క్రీడా రంగంలో విశేష ప్రతిభ కనబరిచి దేశానికి పేరు ప్రఖ్యాతులు తీసుకు వచ్చారని ఆయన జయంతిని జాతీయ క్రీడా దినోత్సవంగా జరుపుకుంటున్నామని వివరించారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులు నిర్వహించిన వివిధ వేషధారణలు ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా తెలుగు తల్లి వేషధారణలో చిన్నారి ప్రత్యేక ఆకర్షణగా



నిలిచింది. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యా యులు రంగస్వామి, అక్కమ్మ, సరస్వతి, నాగమణి, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# సమాజ సేవకులకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంస అవార్డులు




-ఆత్మకూరు ప్రాంతంలో నలుగురికి అవార్డులు
-ప్రతి మనిషి సమాజ సేవ కోసం పాటుపడాలి
-రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు దస్తగిరి

ఆత్మకూరు ఆగస్టు 29 వార్త సాక్ష్యం

జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ జనరల్ సమీక్ష సమావేశం సందర్భంగా శనివారం నంద్యాల జిల్లాలోని రెడ్ క్రాస్ కార్యాలయంలో జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ దస్తగిరి అధ్యక్షతన జిల్లాలో, సమాజ సేవలో ఉత్సాహంగా గుర్తించి వారిని రెడ్ క్రాస్ సంస్థ ద్వారా నంద్యాల జిల్లా కలెక్టర్ .రాజా కుమారి గనియా, జిల్లా సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ సునీల్ షారన్ ద్వారా ప్రశంస పత్రాలు ఇచ్చే కార్యక్రమం ఏర్పాటు చేసారు. ప్రశంస పత్రాలు పొందిన వారిలో ఆత్మకూరు ప్రాంతానికి చెందిన నలుగురికి అవకాశం రావడం జరిగింది కురుకుందకు చెందిన రెడ్ క్రాస్ మండల చైర్మన్ వెంకటేశ్వర్లు, ఆత్మకూరు రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ మక్బూల్ భాష,రెడ్ క్రాస్ లో ఉత్సాహంగా సభ్యత్వాలు చేపట్టిన పట్టణా నికి చెందిన చిన్న శివా కు కలెక్టర్ ప్రశంస పత్రాలు అందజేశారు. అలాగే శ్రీశైలం శాసనసభ్యులు బుడ్డా రాజశేఖర్ రెడ్డి సహకారంతో ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ వారు చేస్తున్న మెడికల్ క్యాంపులు,రక్తదాన శిబిరాలు మరియు క్రీడల సేవలను గుర్తిస్తూ నంద్యాల జిల్లా రెడ్ క్రాస్ వారు ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పస్పిల్ మున్నా కు నంద్యాల జిల్లా కలెక్టర్ .రాజ కుమారి గనియా, చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందించారు.ఈ సందర్భంగా పస్పిల్ మున్నా మాట్లాడుతూ ప్రతిఒక్కరు సమాజా సేవలో ముందుండాలని విజ్ఞప్తి చేశారు.జిల్లా వ్యాప్తంగా జిల్లా కలెక్టర్ మరియు రెడ్ క్రాస్ వారు చేస్తున్న కార్యక్రమాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు

# తెలుగు వికాసంలో బాపట్ల ప్రత్యేకత

బాపట్ల ఆగస్టు 29 వార్త సాక్ష్యం

తెలుగు భాష, సాహిత్య వికాసంలో బాపట్లకు విశిష్ట స్థానం ఉందని ఫోరం ఫర్ బెటర్ కార్యదర్శి డాక్టర్ పి.సి. సాయిబాబు అన్నారు. తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న తెలుగు తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా సాయిబాబు మాట్లాడుతూ తెలుగు లిపి ఆవిర్భావంతో పాటు తెలుగు భాష, సాహిత్య వికాసంలో బాపట్ల ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. తెలుగు తల్లి బాపట్లలోనే జీవం పోసుకుందని, తెలుగులో లేఖా సాహిత్యానికి బాపట్లకు చెందిన కనుపర్తి వరలక్ష్మమ్మ శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. తెలుగు సాహిత్యానికి బాపట్లలోనే ఓనమాలు దిద్దుకున్నాయని, తెలుగు వ్యాకరణ వికాసానికి ఈ ప్రాంతానికి చెందిన భాషా శాస్త్రవేత్తలు విశేష కృషి చేశారని తెలిపారు.ఏం తెలుగు భాషను మరింత సంపన్నం చేసిన బాపట్ల ప్రజలు భాషామాత సేవలో నిరంతరం భాగస్వాములు కావడం గర్వకారణమన్నారు. అంతకు ముందు తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా గిడుగు రామమూర్తి జయంతిని పురస్కరించుకుని



ఆయ న చిత్రప టానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సలీమా, ఫోరం ఫర్ బెటర్ కార్యదర్శి డాక్టర్ పి.సి. సాయిబాబు, సభ్యులు జీవీ, సర్వేయర్ లక్ష్మీనారాయణ, కార్యాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటికి కూటమి సంక్షేమ ఫలాలు

-ఆత్మకూరు సింగిల్ విండో ఛైర్మన్ ఎ. షహబుద్దిన్



ఆత్మకూరు ఆగస్టు 29 వార్త సాక్ష్యం

శ్రీశైల నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ఆదేశాలతో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న"రెండేళ్ల సుపరిపాలన – అభివృద్ధి, సంక్షేమం"అనే కార్యక్రమం శనివారం పట్టణంలో ని 8. వ వార్డు పరిధిలో ఇంటింటి సంక్షేమ పథకాలు కార్యక్రమాలు ప్రారంభించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆత్మకూరు సింగిల్ విండో చైర్మన్ షహబుద్దిన్ హాజరయ్యారు. ఇంటింటికి తిరుగుతూ ఈ రెండేళ్ల కాలంలో కూటమి ప్రభుత్వం స్థానిక శాసనసభ్యులు బుడ్డా రాజశేఖరరెడ్డి చేసిన అభివృద్ధి మరియు ప్రతి ఇంటికి అందుతున్న సంక్షేమ ఫలాల గురించి ప్రజలకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిడిపి పార్టీ యూనిట్ ఇంచార్జ్ మోమిన్ షాకీర్, వార్డు అధ్యక్షులు వి ఎస్ మున్నా, బూతు ఇంచార్జ్ లు అన్వర్ భాష, మహబూబ్ బాషా, జలీల్, విఎస్ .ఖలీల్, ఇర్ఫాన్, సద్దాం తదితరులు పాల్గొన్నారు.

## బాపట్ల మున్సిపాలిటీకి ప్లాటినం జూబ్లీ లోగో ఆవిష్కరణ



బాపట్ల ఆగస్టు 29 వార్త సాక్ష్యం

బాపట్ల మున్సిపాలిటీ 75 ఏళ్ల ప్రస్థానాన్ని పురస్కరించుకుని నిర్వహించనున్న ప్లాటినం జూబ్లీ వేడుకలకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా వేడుకలకు సంబంధించిన ప్రత్యేక లోగోను బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు ఆవిష్కరించారు. 1951లో ఏర్పాటైన బాపట్ల మున్సిపాలిటీ ఏడు దశాబ్దాలకుపైగా ప్రజలకు అందించిన సేవలు, పట్టణ అభివృద్ధి ప్రస్థానాన్ని ప్రతిబిం బించేలా ప్లాటినం జూబ్లీ వేడుకలను నిర్వహించేందుకు ప్రణాళిక రూపొంది స్తున్నారు. వేడుకలను వైభవంగా నిర్వహించడంతో పాటు ప్రజలను భాగస్వాములను చేసేలా కార్యక్రమాలను చేపట్టే అంశంపై ఈ సందర్భంగా చర్చించారు.మున్సిపాలిటీ 75 ఏళ్ల చరిత్రను చాటిచెప్పేలా రూపొందించిన లోగో వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని నిర్వాహకులు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో వేడుకల నిర్వహణకు సంబంధించి మరిన్ని కార్యక్రమాలను ఖరారు చేయనున్నారు. కార్యక్రమంలో ఫోరం ఫర్ బెటర్ కార్యదర్శి డా. పి.సి. సాయిబాబు, గూడంశెట్టి వెంకటేశ్వర్లు (జీవి), మాజీ పట్టణ అధ్యక్షులు గోలపల శ్రీనివాసరావు, చివుకుల దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## 144 నోటీసులపై తహసిల్దార్ సలీమా విచారణ



బాపట్ల ఆగస్టు 29 వార్త సాక్ష్యం

బాపట్ల లో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా బాపట్ల మండలం ములపాలెం గ్రామంలో 144 నోటీసులపై అధికారులు విచారణ చేపట్టారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విచారణలో పోలింగ్ స్టేషన్ నంబర్లు 18, 19 పరిధిలో నోటీసులు అందుకున్న పలువురు హాజరై తమ వివరణలను, ఆధార పత్రాలను సమర్పించారు.ఓటర్ల వివరాల్లో తార్కిక వ్యత్యాసాలు, మ్యాపింగ్ కాని ఓటర్లకు సంబంధించి జారీ చేసిన నోటీసులపై అధికారులు విచారణ నిర్వహించారు. సంబంధిత వ్యక్తులు సమర్పించిన ఆధార పత్రాలను పరిశీలించడంతో పాటు ఎన్నికల రికార్డుల్లోని వివరాలతో సరిపోల్చి చూస్తున్నారు.తహసిల్దార్ సలీమా విచారణ ప్రక్రియను పర్యవేక్షించి, ఒక్కో నోటీసుకు సంబంధించిన వివరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఓటర్లు సమర్పించిన ఆధారాలను నిబంధనల మేరకు పరిశీలించి, ఓటర్ల జాబితాలోని వ్యత్యాసాలు, మ్యాపింగ్ సమస్యలను పరిష్కరించేలా సిబ్బందికి సూచనలు చేశారు.ఎస్ఐఆర్ ప్రక్రియలో అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో సక్రమంగా ఉండేలా చూడటమే లక్ష్యమని అధికారులు తెలిపారు. ఓటర్ల జాబితా ఖచ్చితత్వం, పారదర్శకత, సంపూర్ణతను నిర్ధారించే దిశగా విచారణ, పరిశీలన ప్రక్రియ కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు.

VARTHAA SAKSHAMU RNI Title Code: APTEL/25/A9153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
ఆదివారం 30 ఆగష్టు 2026

## వర్ల రామయ్యకు ఘన సన్మానం

-ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు



గుంటూరు ఆగస్టు 29 వార్త సాక్ష్యం

తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య శాసనమండలి సభ్యునిగా నియమితులైన సందర్భంగా గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పాల్గొని వర్ల రామయ్యను ఘనంగా అభినందించారు.ఈ సందర్భంగా నక్కా ఆనందబాబు మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీలో దశాబ్దాలుగా వర్ల రామయ్య అందిస్తున్న సేవలు, పార్టీ సిద్ధాంతాల పట్ల ఆయన చూపుతున్న నిబద్ధత, క్రమశిక్షణ అభినందనీయమన్నారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేస్తూ అంచలంచెలుగా ఎదిగిన ఆయనకు శాసనమండలి సభ్యుడిగా అవకాశం దక్కడం సంతోషక రమన్నారు. ఎమ్మెల్సీగా శాసనమండలిలో ప్రజా సమస్యలను సమర్థవంతంగా ప్రస్తావిస్తూ, ప్రజా సంక్షేమం కోసం మరింతగా కృషి చేయాలని ఆనందబాబు ఆకాంక్షించారు. వర్ల రామయ్యను శాసనమండలి సభ్యునిగా నియమించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.అభినందన సభలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని వర్ల రామయ్యకు శుభాకాంక్షలు తెలిపారు.

## తాగునీటి సమస్యపై ఎండీఓ స్పందన



కర్లపాలెం ఆగస్టు 29 వార్త సాక్ష్యం

కర్లపాలెం మండలంలోని నర్రావారిపాలెం గ్రామ ఎస్టీ కాలనీలో తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న ఎండీఓ అద్దూరి శ్రీనివా సరావు వెంటనే స్పందించారు. సమస్య పరిష్కారానికి అధికారులను అప్రమత్తం చేసి పైపులైన్ మరమ్మతు పనులను తక్షణమే చేపట్టేలా చర్యలు తీసుకున్నారు. పైపులైన్‌లో ఏర్పడిన సాంకేతిక సమస్య కారణంగా కాలనీకి నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో మంచినీటి కోసం ప్రజలు అవస్థలు పడుతున్నారని సమాచారం అందిన వెంటనే ఎండీఓ స్పందించి సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. మరమ్మతు పనులను వేగవంతం చేసి మధ్యాహ్నంలోగా నీటి సరఫరాను పునరుద్ధరించేలా చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా ఎండీఓ అద్దూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఎస్టీ కాలనీలో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిన విషయం తన దృష్టికి వచ్చిన వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు ప్రారంభించామన్నారు. పైపులైన్‌కు అవసరమైన మరమ్మతులు పూర్తి చేసి వీలైనంత త్వరగా నీటిని విడుదల చేస్తామని తెలిపారు. కాలనీవాసులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సమస్యను పూర్తిగా పరిష్కరించి నిరంతర నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రజలకు అత్యవస రమైన తాగునీటి సమస్యపై ఎండీఓ వెంటనే స్పందించి మరమ్మతు పనులు ప్రారంభించడంపై కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. ఎండీఓ వెంట ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుధా, పంచాయతీ కార్యదర్శి దివ్య ఉన్నారు.

## పార్టీ ఆదేశాల మేరకు స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి: ఎమ్మెల్యే అరవ శ్రీధర్

ఆగస్టు 29 వార్త సాక్ష్యం



జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ ఆధ్వర్యంలో నిర్వహి ంచిన కార్యక్ర మంలో రైల్వే కోడూరు శాసనస భ్యులు అరవ శ్రీధర్ పాల్గొ న్నారు. ఈ సందర్భంగా రైల్వే కోడూ రు నియోజ కవర్గంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు జనసేన పార్టీ అధిష్టానం సూచనలు, ఆదేశాల మేరకు నాయకులు, కార్యకర్తలు సమన్వ యంతో పనిచేయాలని పార్టీ అధ్యక్షులు, గౌరవ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిర్దేశించిన ప్రణాళికను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. ప్రతి గ్రామం, మండలంలో పార్టీ బలాబలాలను అంచనా వేసుకుని, స్థానిక సమస్యలను ప్రజల నుంచి తెలుసుకుని ఎన్నికలకు సిద్ధం కావాలన్నారు.సెప్టెంబర్ 2న జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా ప్రతి నియోజక వర్గంలో జనసేన యువజన విభాగాన్ని ప్రారంభించనున్నట్లు పార్టీ అధిష్టానం ప్రకటిం చిందని తెలియజేశారు.యువత, మహిళలకు ప్రాధా న్యం ఇస్తూ పార్టీ నాయకత్వం తీసుకుంటున్న నిర్ణయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపా రు. కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్ర మాలను ప్రజలకు వివరించడంతో పాటు, జనసేన పార్టీ బలాన్ని స్థానిక సంస్థల ఎన్నికల్లో చాటేలా ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ కోరారు.పార్టీ అధిష్టానం ఏ బాధ్యత అప్పగించినా క్రమశి క్షణతో, సమష్టిగా పనిచేసి విజయానికి కృషి చేయాలని ఆయన నాయ కులు, జనసైనికులకు సూచించారు.

# ప్రతిఒక్కరు భక్తిమార్గాన్ని అలవరచుకోవాలి





-డోన్ సి.ఐ, సి.ఎం. రాకేశ్

-కొత్తకోటలో ఘనంగా ముగిసిన తితిదే ధార్మిక కార్యక్రమాలు

నంద్యాల ఆగస్టు 29 వార్త సాక్ష్యం

సమాజంలో ప్రతి మానవుడు భక్తి చింతనతో మెలగవలెనని, సమాజంలో శాంతియుతమైన జీవ నం నెలకొంటుందని డోన్ పట్టణ సి.ఐ. సి.ఎం. రాకేశ్ అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఆధ్వర్యంలో డోన్ మండలం, కొత్తకోట గ్రామంలోని శివాలయ ంనందు గత ఐదురోజులుగా జరుగుతున్న ధార్మిక కార్యక్ర మాల శనివారం ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రతిరోజు స్థానిక భజన మండలిచే భజనలు, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపా ధ్యాయులు డాక్టర్ తొగట సురేశ్ బాబు శ్రీమద్రా మాయణము, మహాభారతం, భగవద్గీతలపై చేసిన ధార్మిక ప్రవచనాలు భక్తులను ఎంతగానో అలరిం చాయి. ఈ కార్యక్రమంలో తిరుమల తిరుపతి దేవస్థా నములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంక టరెడ్డి, ధర్మ ప్రచారమండలి సభ్యులు డాక్టర్ ఎస్.దేవీ దయానంద సింగ్, మాజీ సర్పంచ్ వి.చంద్రన్న గ్రామ పెద్దలు బి.లక్ష్మీనా రాయణ రెడ్డి, బి. సుదర్శన్ రెడ్డి, రాఘవేంద్ర, తలారి చంద్రన్న, ఉపద్యాయులు వై. శ్రీనివాసులు రెడ్డి, వై.రమ ణారెడ్డి, బి. చంద్రశేఖర్ రెడ్డి, బి. గురుమో హన్ రెడ్డి, వై. రామిరెడ్డితోపాటు పెద్ద సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## విక్టరీ నవోదయ కోచింగ్ సెంటర్ ను తక్షణమే సీజ్ చేయాలి :ఎస్ఎఫ్ఐ - ఏఐఎస్ఎ

-జిల్లా విద్యాశాఖ అధికారికి ఎస్ఎఫ్ఐ - ఏఐఎస్ఎ వినతి

కర్నూలు ఆగస్టు 29 వార్త సాక్ష్యం

ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఎమ్మిగనూరు పట్టణంలో అక్రమంగా నిర్వహిస్తున్న విక్టరీ నవోదయ కోచింగ్ సెంటర్ ను తక్షణమే సీజ్ చేయాలని ఎస్ఎఫ్ఐ - ఏఐఎస్ఎ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శనివారం జిల్లా విద్యాశాఖ అధికారి సుధాకర్ కి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భ ంగా ఏఐఎస్ఎ రాష్ట్ర కార్యదర్శి స్వామిదాసుగారి నాగార్జున, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రంగప్ప, మాట్లాడుతూ. విద్యార్థుల భవిష్యత్తుతో, తల్లిదండ్రుల ఆశలతో వ్యాపారం చేస్తున్న విక్టరీ నవోదయ కోచింగ్ సెంటర్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకో వాలని డిమాండ్ చేశారు.ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులను అక్రమంగా తరలించి, పాఠశాల రికార్డుల్లో తప్పుడు హాజరు చూపిస్తూ, ఫేక్ టీసీలు, బోనఫైడ్ సర్టిఫికెట్లు సృష్టిస్తూ పెద్ద ఎత్తున మోసానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. విద్యార్థుల డేటాను, పాఠశాలల హాజరు రిజిస్టర్లను, కోచింగ్ సెంటర్ రికార్డులను క్షుణ్ణంగా సరిపోల్చి విచారణ చేపట్టాలని ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఖాజా బాషా సర్వీస్ రూల్స్ కు విరుద్ధంగా ఈ ప్రైవేట్ కోచింగ్ సెంటర్ నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తూ, అడ్మిషన్లు, భారీ ఫీజుల వసూళ్లకు పాల్పడుతున్నారని, ఆయనపై శాఖాపరమైన విచారణ జరిపి సర్వీస్ నుండి తొలగించాలని డిమాండ్ చేశారు.అంతేకాకుండా ఇటీవల ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీల్లో ఆ సెంటర్ హాస్టల్ లో నాణ్యతలేని ఆహార పదార్థాలు, పరిశుభ్రత లోపాలు బయటపడ్డాయని, విద్యార్థుల ఆరోగ్య భద్రత దృష్ట్యా ఆహార నమూనాల పరీక్షా ఫలితాలను బహిర్గతం చేయాలని



కోరారు.కావున సంబంధిత అధికారులు స్పందించి ఎమ్మిగనూరు విక్టరీ నవోదయ కోచింగ్ సెంటర్ పై సమగ్ర విచారణ జరిపి సీజ్ చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడ తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు అంజి, ఏఐఎస్ఎ నాయకులు అశోక్, వర్ధన్, సూర్య తదితరులు పాల్గొన్నారు

# నంద్యాల జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి

-పంటల బీమా వర్తింపచేయాలి. ఏపీ రైతు సంఘం డిమాండ్

ఆత్మకూరు ఆగస్టు 29 వార్త సాక్ష్యం

నంద్యాల జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి పంటల బీమా వర్తింపచేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఏ రాజశేఖర్ సిఐటియు జిల్లా అధ్యక్షులు వి ఏసురత్నం రైతు సంఘం జిల్లా నాయకులు రాజు శనివారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నంద్యాల జిల్లాలో వర్షపాతం 53% లోటు ఉంది గత రెండు సంవత్సరాలు రైతు రైతులు పంటలు వేసుకున్న గిట్టుబాటు ధర లేక అప్పుల పాలు అయినారు ఈ సంవత్సరం లో కాలం కలిసి వస్తుందని పాత హక్కులకు తోడు కొత్త అప్పులు చేసి వ్యవసాయం చేశారు దాదాపుగా 30 నుండి 50 వేల వరకు పెట్టుబడి పెట్టి మొక్కజొన్న పత్తి మినుము సోయాబీను మిర్చి తదితర పంటలు వేశారు. ఎల్ నీనో ప్రభావముతో వర్షాలు పడకపోవడం బావులు చెరువుల్లో నీళ్లు ఎండిపోయాయి రైతులు పంటలు అన్నిటిని కూడా పశువులకు మేతగాను ఉన్న పంటలను చెడగొడుతున్నారు రాష్ట్ర ప్రభుత్వము జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి కరువు మండలాలను వెంటనే ప్రకటించి పంటల బీమా వర్తింప చేయాలని లేకపోతే రైతులకు ఆత్మహత్యలే శరణమని వారన్నారు నందికొట్కూరులో మొక్కజొన్న పంటను రాసిన పొలాన్ని పరిశీలించి రైతులను వెంటనే ఆదుకోవాలని రైతులపై ఉన్న అన్ని రకాల అప్పులను రద్దు చేయాలని రవి పంటకు కావలసిన విత్తనాలు ఎరువులు ఉచితంగా ఇవ్వాలని వారు కోరారు పశు గ్రాసం కేంద్రాలు ఏర్పాటు చేసి పశు వులకు ఉచితంగా గడ్డి ఇవ్వాలి వ్యవసాయ కూలీలకు ఉచిత కూపన్లు ఇచ్చి 30 కేజీల బియ్యంతో పాటు నిత్యవసర వస్తువులు సరుకులు ఉచితంగా ఇవ్వాలి ఈ సందర్భంగా రాష్ట్రంలోని ఎమ్మెల్యేలు అందరూ పొలం బాట పట్టి రాష్ట్ర ముఖ్యమంత్రి తో మాట్లాడి రైతుల పరిస్థితులను వివరించి రైతులకు




నష్టపరిహారం ఇచ్చి వాళ్ళని ఆదుకోవాలి ఓట్లేసి అధికారంలోకి తెచ్చిన ప్రభుత్వం కరువు కాలంలో రైతులను ఆదుకోవాల్సిన బాధ్యత ఉందని వారన్నారు జిల్లాలోని చెరువులు రిజర్వాయర్లు లిఫ్ట్ ల ద్వారా నీళ్లు వదలాలని వారు డిమాండ్ చేశారు ఈ బృందంలో సిఐటియు నందికొట్కూరు కార్యదర్శి గోపాలకృష్ణ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కర్ణ నాయకులు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## పట్టణంలో సిపిఐ, ఎఐటియుసి ఆధ్వర్యంలో ప్రజా పోరాటానికి తక్షణ స్పందన

ఆత్మకూరు ఆగస్టు 29 వార్త సాక్ష్యం

పట్టణంలోని ఆర్టిడి కాలనీ లో ప్రవహించే గుండ్లకమ్మ వాగు/కాలువలో పిచ్చిచెట్లు, మట్టి, చెత్తాచెదారం పేరుకుపోవడంతో వర్షాకాలంలో ఇందిరా నగర్, ఏకలవ్య నగర్, గరీబ్ నగర్ తదితర ప్రాంతాలు నీటి ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని సిపిఐ ఆత్మకూరు తాలూకా కార్యదర్శి టి. ప్రతాప్, ఎఐటి యుసి ఆత్మకూరు తాలూకా కార్యదర్శి షేక్ దూద్ పీరా మరియు కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తూ మున్సిపల్ అధికారులను డిమాండ్ చేశారు.ఈ నిరసనలపై స్పందించిన ఆత్మకూరు ము న్సిపాలిటీ సిబ్బంది వెంటనే స్పందించి, జెసిపి యం త్రాల సహాయంతో శనివారం గుండ్లకమ్మ కాలువ లోని పూడిక, పిచ్చిచెట్లను తొలగించే పనులను వేగవ ంతంగా చేపట్టారు. దీంతో సిపిఐ చేపట్టిన పోరాటం విజయవంతమైందని కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.



# కురుకుంద గ్రామంలో ఘనంగా తెలుగు భాషా దినోత్సవం





ఆత్మకూరు ఆగస్టు 29 వార్త సాక్ష్యం

దేశభాషలందు తెలుగు లెస్స అని కురుకుంద ఉన్నత పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయురాలు జగదీశ్వరి అన్నారు. శనివారం పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవడం జరిగింది .ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగు వాడుక భాష ఉద్యమ పితామహుడు చరిత్రకారుడు సంఘసంస్కర్త హేతువాది ఉపాధ్యాయుడు గిడుగు వెంకట రామమూర్తి పంతులు గారి 163 వ జన్మదినోత్సవాన్ని మరియు జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా జరుపుకోవడం జరిగింది ఈ సందర్భంగా ఆమె మాటాడుతూ గ్రాంథిక భాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుక భాషలోకి తీసుకువచ్చి నిత్య వ్యవహారములోని భాషలో ఉన్న అందాన్ని విలువను తెలియజేప్పిన మహనీయుడని, ఆంధ్రదేశంలో వ్యవహారిక భాష ఉద్యమానికి మూల పురుషుడు బహు భాషా కోవిదుడు సంఘసంస్కర్త హేతువాది శిష్ట జన వ్యవహారిక భాషను గ్రంథ రచనకు స్వీకరింప చేయడానికి చిత్తశుద్ధితో కృషిచేసిన అచ్చ తెలుగు చిచ్చర పిడుగు గిడుగు. గిడుగు ఉద్యమం వల్ల ఏ కొద్దిమందికో పరిమితమైన చదువు వ్యవహారిక భాషలో సాగి అందరికీ అందుబా టులోనికి వచ్చిందని ఆమె అన్నారు.పండితులకే పరిమితమైన సాహిత్య సృష్టి,సృజనాత్మక శక్తి ప్రతి ఒక్కరికి వీలైందని,గిడుగు రామమూర్తి పంతులు గారి జన్మ దినోత్సవం .ఆగస్టు ..29 తెలుగు భాషా దినోత్సవంగా ప్రతి సంవత్సరం జరుపుకుం టున్నాము. తెలుగు భాష తేనే కన్నా తీయనిది, వెన్నకన్నా కమ్మనిది,చందమామ కన్నా చల్లనిది అని, తెలుగు నేర్చుకుందాం మన భవిత మార్చుకుందాం, మాతృభాష నేర్చుకో అనుబంధం పెంచుకో, తెలుగు జాతి మనది తెలుగు భాష మనది, తెలుగు నేలపైన తెలుగు వికసించాలి,మాతృభాష తెలుగు మన బ్రతుకంతా వెలుగు,నేర్చుకుందాం నేర్చుకుందాం తెలుగు భాషను నేర్చుకుందాం అని ఆమె అన్నారు. పి.డి మురళి నాయక్ మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడలకు కూడా కొంత సమయాన్ని కేటాయించాలని ఆయన విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం వ్యాసరచన,పద్య పోటీల్లో గెలుపొం దిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేయడం జరిగింది. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు జవహర్ నాయక్, మురళీ నాయక్,రవి, రవి ప్రకాష్, మాధవి, విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్రీశైలంలో నీటి నిల్వలు ఉన్న దిగువకు నీరు వదలరా







-కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించిన మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిరెడ్డి

నంద్యాల ఆగస్టు 29 వార్త సాక్ష్యం

వార్షాభావ పరిస్థితుల్లో రైతులకు పంటలు సాగు చేసేందుకు, ప్రజలకు, పశువులకు త్రాగునీరు లేక విలవిల లాడిపోతున్న పరిస్థితిలో... అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం శ్రీశైలంలో నీటి నిల్వలు ఉన్నాయని చెబుతున్నారని, అయితే దిగువకు నీటిని ఎందుకు వదలడంలేదో చెప్పాలని నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిషోర్ రెడ్డి సూటిగా ప్రశ్నిస్తున్నారు. శనివారం నంద్యాల జిల్లా పరిధిలోని మిట్నాల గ్రామానికి చెందిన నీటి కుంటలో చుక్కనీరులేక ఎండిపోయిన దుస్థితిని చూస్తున్నామని ఆయన పేర్కొన్నారు. అలాగే నంద్యాల పట్టణ శివారులోని చిన్నచెరువుకూడా ఎండి పోవడాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిషోర్ రెడ్డి,మాట్లాడుతూ గత 24 సంవత్సరాల తర్వాత నంద్యాల మండలం మిట్నాల గ్రామ కుంట ఎండిపోయిందని పేర్కొన్నారు. దుర్భిక్షపరిస్థితిలో ఉన్న రైతులకు, ప్రజలకు, పశువులకు కనీసం నీరు అందించే పరిస్థితిలో కూటమి ప్రభుత్వం లేదని విమర్శించారు. శ్రీశైలం ప్రాజెక్ట్ నీరు నిల్వ ఉందని త్రాగునీటిని విడుదల చేస్తామని ప్రజలకు ఒట్టి మాటలు చెబుతూ కాలం గడిపేస్తున్నారని పేర్కొన్నారు. కనీసం తెలంగాణా రాష్ట్రంలో నాయకులు చూపిస్తున్న చొరవ నేడు కూటమి నేతలు చూపించడం లేదని ఎంతో దారుణంగా ఉందని విమర్శించారు. నీటి వాటాల్లో రెండు తెలుగురాష్ట్రాలకు సమాన హక్కులు ఉన్నాయని తెలిపారు. అయితే మన ఏపీకి మాత్రం నీటిని ఎందుకు విడుదల చేయడంలోదో ప్రభుత్వం చెప్పాలన్నారు. వీటికి అంతటికి కారణం తెలంగాణ సీఎంతో ఏపీ సీఎం చేసుకున్న చీకటి ఇప్పందం అని తేటతెల్లం అయ్యిందన్నారు. జిల్లా కలెక్టర్ మాత్రం సాగునీరు ఉందని, త్రాగునీరు ఉందని చెబుతు న్నారని, అయితే వాస్తవ పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయనడానికి మిట్నాల కుంట సాక్షం అన్నారు. ఇటీవల



ప్రధాన మంత్రి మన్కీ బాత్లో నంద్యాలకు త్రాగు నీరు, సాగునీరు ఇస్తున్నామని పొగిడారని ఇది నిజంగా ఉందో లేదో అధికారులు చెప్పాలన్నారు. కలెక్టర్ కార్యాలయానికి 10 కిలో మీటర్ ల దూరంలో ఉన్న మిట్నాల గ్రామానికి నీరు లేదన్నారు. ఈ గ్రామాన్ని అభివృద్ధి చేసింది మాత్రం మాజీ మంత్రి శిల్పా మోహన్ రెడ్డి అని ప్రతి ఒక్కరు చెబుతున్నారని తెలిపారు. నీటి సమన్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్ర మంలో గ్రామ వైసీపీ నాయకులు తిరుపతి రెడ్డి ,రైతులు, వైసీపీ నాయకులు,గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రగతి హై స్కూల్ లో ఘనంగా తెలుగు భాషా, క్రీడా దినోత్సవ సంబరాలు



-ప్రగతి హై స్కూల్ కరస్పాండెంట్ శకుంతల రాఘవ కృష్ణ

ఆత్మకూరు ఆగస్టు 29 వార్త సాక్ష్యం

తెలుగు భాష, క్రీడా దినోత్సవాల సందర్భంగా శనివారం పట్టణంలోని ప్రగతి హైస్కూల్లో పాఠశాల కరస్పాండెంట్ రాఘవ కృష్ణ, శకుంతల ఆధ్వర్యంలో పలు సాంప్రదాయ కార్యక్రమాలను విద్యార్థుల చేత నిర్వహించారు విద్యార్థుల ప్రతిభను చూసి ప్రత్యేక బహుమతులు అందజేశారు అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పాఠశాల కరస్పాండెంట్లు మాట్లాడుతూ దేశ భాషల యందు తెలుగు లెస్స,



మన మాతృభాష పిల్లలు చిన్నప్పటి నుండే తెలుగును విస్మరించకూడదని ప్రతి ఒక్కరూ తెలుగులో మాట్లాడుతూ మిగతా భాషలలో పరిజ్ఞానం పెంచుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యా యులు విద్యార్థిని విద్యార్థులు వివిధ వేషాలతో చిత్రాలతో క్రీడా దినోత్సవం సందర్భంగా ధ్యాన్చంద్ కి



పూలమాలతో సత్కరించారు ప్రతి ఒక్క విద్యార్థిని విద్యార్థులు చిన్నతనం నుండే మానసికంగా శారీరకంగా ఎదగాలంటే క్రీడలు ఎంతో అవసరం అని కొనియాడారు ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# ఓటర్ల హియరింగ్ పారదర్శకంగా జరగాలి

-ఎలక్ట్రోరల్ అబ్జర్వర్ కన్నబాబు

బాపట్ల ఆగస్టు 29 వార్త సాక్ష్యం



ప్రత్యేక సంక్షిప్త ఓటర్ల సవరణ ప్రక్రియలో భాగంగా నిర్వహిస్తున్న హియరింగ్‌లను నిబంధనలకు అనుగుణంగా, పూర్తిస్థాయి పారదర్శకతతో నిర్వహించాలని జిల్లా ఎలక్టోరల్ అబ్జర్వర్, రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ కె.కన్నబాబు అధికారులను ఆదేశించారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. శనివారం చీరాల మండలం ఈపూరుపా లెంలోని 18, 20 పోలింగ్ కేంద్రాలతో పాటు బాపట్ల మున్సిపాలిటీ పరిధిలోని మున్సిపల్ హైస్కూల్‌లో ఉన్న 86, 89 పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న హియరింగ్ ప్రక్రియను కన్నబాబు పరిశీలించారు. హియరింగ్‌కు హాజరైన ఓటర్ల దరఖాస్తులు, అభ్యంతరాలు, సంబంధిత రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటర్ల సవరణలో భాగంగా అందుతున్న క్లెయిమ్‌లు, అభ్యంతరాలను నిబంధనల మేరకు క్షుణ్ణంగా పరిశీలించాలని బీఎల్ఓలు, ఏఈఆర్ఓలు, ఈఆర్ఓలకు సూచించారు. ప్రతి దరఖాస్తును సంబంధిత ఆధార పత్రాలతో పరిశీలించిన అనంతరం నిబంధనల ప్రకారం నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నిష్పక్షపా తంగా హియరింగ్ నిర్వహించాలని తెలిపారు.హియరింగ్‌కు హాజరయ్యే ఓటర్లకు అవసరమైన సమాచారం ముందుగానే అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఓటర్ల జాబితా ఖచ్చితత్వం, పారదర్శకతను కాపాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండేలా చూడటం అధికారుల బాధ్యత అని పేర్కొన్నారు. కన్నబాబు వెంట చీరాల, బాపట్ల ఆర్డీఓలు కె.నరసింహారావు, ఏ. హరికుమార్, డీఎస్ఓ జగన్మోహన్, చీరాల, బాపట్ల తహసీల్దార్లు గోపీకృష్ణ, షేక్ సలీమా, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, ఏఈఆర్ఓలు, డీటీ ఫణికుమార్, బీఎల్ఓలు తదితరులు ఉన్నారు.

# బీఎస్ఎన్ఎల్ టెలిఫోన్ టవర్‌కు శంకుస్థాపన



నెల్లూరు జిల్లా, ఉదయగిరి ఆగస్టు 29 వార్త సాక్ష్యం

ఇజుమూరు మండలం జనార్ధన్‌పురం గ్రామంలో బీఎస్ఎన్ఎల్ టెలిఫోన్ టవర్ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, న్యాయ మరియు మైనార్టీ సంక్షేమ శాఖల మంత్రి ఎండీ ఫరూక్ ముఖ్య అతిథులుగా పాల్గొని టెలిఫోన్ టవర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన టెలికాం సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావడం ప్రభుత్వ లక్ష్యమన్నారు. జనార్ధన్ పురం, పరిసర గ్రామాల ప్రజలకు బీఎస్ఎన్ఎల్ టెలిఫోన్ టవర్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు, రైతులు, వ్యాపారులు, ఉద్యోగులు, యువతకు మెరుగైన కమ్యూనికేషన్ సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. మారుమూల ప్రాంతాల్లోనూ డిజిటల్ కనెక్టివిటీని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని, నియోజకవర్గ అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని మంత్రులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ అధ్యక్షులు చెంచాల బాబు, మాజీ ఎమ్మెల్యే కంభం విజయరాఘవారెడ్డి, మండల కన్వీనర్ గూడా నర్సిరెడ్డి, టెలికం అడ్వైజర్ కమిటీ మెంబర్ తాటికొండ అనూష, యూత్ లీడర్ వంశీ, వని పెద్ది సుబ్బారెడ్డి, వనిపెద్ది హైమావతి ఇంజుమూరు ఎంపీపీ కూడెళ్ళ వెంకటేశ్వర్లు రవీంద్రబాబు,స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు



VARTHAA SAKSHAMU
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# బిజినెస్

## ఫుడ్ ప్యాకెట్లపై ఇక రెడ్ వార్నింగ్..
## సుప్రీంకోర్టుకు ఎఫ్ఎస్ఎస్ఏఐ కీలక ప్రతిపాదన

ప్యాక్ చేసిన ఆహార పదార్థాలు, శీతల పానీయాలపై త్వరలోనే ఎరుపు రంగు హెచ్చరిక గుర్తులు (లేబుల్స్) కనిపించనున్నాయి. ఉప్పు, చక్కెర లేదా కొవ్వు పదార్థాలు పరిమితికి మించి ఉన్న ఉత్పత్తుల ప్యాకెట్ల ముందరి భాగంలో ఈ హెచ్చరికలను ముద్రించాలని భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ప్రతిపాదించింది. వినియోగదారులు ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఎంచుకోవడంలో ఈ నిర్ణయం తోడ్పడుతుందని ఎఫ్ఎస్ఎస్ఏఐ పేర్కొంది. ఈ ప్రతిపాదన ప్రకారం.. ప్యాకెట్లపై 'హై ఫ్యాట్', 'హై షుగర్', 'హై సాల్ట్' లేదా 'హైలీ స్వీటెన్డ్ బేవరేజ్' వంటి హెచ్చరికలు స్పష్టంగా కనిపించేలా ముద్రించాల్సి ఉంటుంది. ఈ మేరకు ఎఫ్ఎస్ఎస్ఏఐ తన ప్రతిపాదనలను సుప్రీంకోర్టుకు సమర్పించింది. ఆహార ప్యాకెట్లపై హెచ్చరిక లేబుళ్లను తప్పనిసరి చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై అత్యున్నత న్యాయస్థానం విచారణ జరుపుతోంది. ఈ అంశంలో జరుగుతున్న జాప్యంపై జస్టిస్ జె.బి. పార్దివాలా, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ఇటీవల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. వ్యాపార ప్రయోజనాల కంటే ప్రజల, ముఖ్యంగా చిన్నారుల ఆరోగ్యానికే అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేసింది. అయితే, ఈ నిర్ణయం తమ అమ్మకాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని నెస్లే, పెప్సికో, కోకా-కోలా వంటి దిగ్గజ సంస్థలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి.రెండు వారాల్లోగా ఈ విషయంలో స్పష్టమైన విధివిధానాలను రూపొందించాలని కోర్టు ఆదేశించిన నేపథ్యంలో ఎఫ్ఎస్ఎస్ఏఐ ఈ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. సుప్రీంకోర్టుకు సమర్పించిన ఫైలింగ్‌లో ఎఫ్ఎస్ఎస్ఏఐ ఈ వివరాలను వెల్లడించింది.



## ఏథర్ నుంచి కొత్త ఎలక్ట్రిక్ స్కూటర్.. రూ.1 లక్షకే 'కోణార్క్'

ప్రముఖ దేశీయ ఎలక్ట్రిక్ వాహన తయారీ సంస్థ ఏథర్ ఎనర్జీ, భారత మార్కెట్లోకి మరో సరికొత్త ఉత్పత్తిని తీసుకొచ్చింది. శనివారం జరిగిన 'కమ్యూనిటీ డే 2026' కార్యక్రమంలో భాగంగా, సామాన్యులను లక్ష్యంగా చేసుకుని 'ఏథర్ కోణార్క్' పేరుతో కొత్త ఎలక్ట్రిక్ స్కూటర్‌ను ఆవిష్కరించింది. దీని ప్రారంభ ధరను రూ.99,999 గా నిర్ణయించింది. కేవలం స్కూటర్‌ను మాత్రమే కాకుండా, సరికొత్త బ్యాటరీ ప్లాట్‌ఫామ్, అధునాతన ఛార్జింగ్ సదుపాయాలు, వాహన ఓనర్‌షిప్‌కు సంబంధించిన టూల్స్‌ను కూడా కంపెనీ పరిచయం చేసింది.

**-'కోణార్క్' ప్రత్యేకతలు ఇవే..**

ఏథర్ నుంచి వస్తున్న 450 సిరీస్ స్కూటర్లు అధిక పనితీరుకు ప్రాధాన్యం ఇవ్వగా, 'కోణార్క్' మాత్రం రోజువారీ వినియోగానికి అనుకూలంగా, సౌకర్యవంతంగా ఉండేలా రూపొందించబడింది. ఏథర్ అభివృద్ధి చేసిన కొత్త 'ఈఎల్ ప్లాట్‌ఫామ్' ఆధారంగా వస్తున్న తొలి స్కూటర్ ఇదే. మొత్తం ఎస్, జడ్ లైన్‌అప్‌లలో ఆరు వేరియంట్లలో ఇది అందుబాటులో ఉంటుంది. ఐడీసీ సర్టిఫైడ్ రేంజ్ ప్రకారం, ఒక్కసారి పూర్తి ఛార్జ్ చేస్తే వేరియంట్‌ను బట్టి 100 నుంచి 200 కిలోమీటర్ల వరకు ప్రయాణించవచ్చని కంపెనీ పేర్కొంది. ప్రతి 10,000 కిలోమీటర్లకు ఒకసారి సర్వీసింగ్ చేయిస్తే సరిపోతుంది. అడ్వాన్స్‌డ్ ఎలక్ట్రానిక్ బ్రేకింగ్ సిస్టమ్ (ఈబీఎస్), మ్యాజిక్‌కీ, ఆటోహోల్డ్, ఎయిర్‌వాక్ మోడ్ వంటి అత్యాధునిక ఫీచర్లను ఇందులో పొందుపరిచారు.

**-10 ఏళ్ల వారంటీతో 'బెడ్‌రాక్' బ్యాటరీ**

ఈ కార్యక్రమంలో అత్యంత కీలకమైన ఆకర్షణ ఏథర్ ఐదో తరం 'బెడ్‌రాక్' బ్యాటరీ ప్లాట్‌ఫామ్. ఈ బ్యాటరీపై కంపెనీ ఏకంగా 10 ఏళ్లు లేదా 1,00,000 కిలోమీటర్ల వారంటీని అందిస్తోంది. ఇందులో ఉన్న 'బ్రీచ్‌సెన్స్' టెక్నాలజీ, ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు బ్యాటరీకి కలిగే సూక్ష్మమైన డ్యామేజ్‌ను, తేమ చేరే ప్రమాదాన్ని వెంటనే గుర్తిస్తుంది. మెరుగైన సెల్ బ్యాలెన్సింగ్ టెక్నాలజీ వల్ల లక్ష నుంచి 1.2 లక్షల కిలోమీటర్లు ప్రయాణించిన తర్వాత కూడా బ్యాటరీ ఆరోగ్యం 70 శాతం వరకు ఉంటుందని ఏథర్ భరోసా ఇస్తోంది.




**-అపార్ట్‌మెంట్ల కోసం 'ఏథర్ నోడ్'**

స్కూటర్‌తో పాటు, ఏథర్ సంస్థ ఛార్జింగ్ మౌలిక సదుపాయాలపై కూడా దృష్టి పెట్టింది. అపార్ట్‌మెంట్లు, వాణిజ్య భవనాల్లో ఛార్జింగ్ సమస్యను అధిగమించేందుకు 'ఏథర్ నోడ్' అనే లోడ్-మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను పరిచయం చేసింది. ఇది ఒకేసారి 1,000 ఛార్జర్లను నిర్వహించగలదు. విద్యుత్ డిమాండ్ ఎక్కువగా ఉన్నప్పుడు ఆటోమేటిక్‌గా ఛార్జింగ్‌ను నిలిపివేసి, పవర్ మేనేజ్‌మెంట్ చేస్తుంది. దీంతో పాటు పాత స్కూటర్ల యజమానుల కోసం 'ఏథర్ ట్రూ హెల్త్' అనే రిపోర్ట్‌ను కూడా ప్రకటించింది. ఇది వాహనం కండిషన్, బ్యాటరీ ఆరోగ్యం, రైడింగ్ హిస్టరీ వంటి వివరాలను అందించి, మెరుగైన రీసేల్ విలువ పొందడానికి సహాయపడుతుంది.మొత్తం మీద, కేవలం కొత్త స్కూటర్‌ను విడుదల చేయడమే కాకుండా, బ్యాటరీ లైఫ్, ఛార్జింగ్ సౌలభ్యం, రీసేల్ వంటి అంశాలపై దృష్టి సారించి, వినియోగదారులకు ఒక సంపూర్ణ ఓనర్‌షిప్ అనుభవాన్ని అందించడమే లక్ష్యంగా ఏథర్ ముందుకు వెళ్తున్నట్లు స్పష్టమవుతోంది.

## 51 ఏళ్ల వయసులో అద్భుతం.. 94 ఏళ్ల క్రికెట్ రికార్డును బద్దలుకొట్టిన మహిళ!

క్రికెట్ చరిత్రలో ఓ అద్భుతమైన అధ్యాయం లిఖితమైంది. వయసు కేవలం ఒక సంఖ్య మాత్రమేనని నిరూపిస్తూ, 'ఐల్ ఆఫ్ మ్యాన్' జట్టు మహిళా క్రికెటర్ జోవాన్నే హిక్స్ సరికొత్త చరిత్ర సృష్టించింది. 51 ఏళ్ల వయసులో అంతర్జాతీయ మ్యాచ్‌లో ఐదు వికెట్ల ప్రదర్శన (ఫైఫర్) చేసి, 94 ఏళ్లుగా చెక్కుచెదరని ప్రపంచ రికార్డును బద్దలుకొట్టింది. ఈ ఘనత సాధించిన అత్యంత పెద్ద వయస్కురాలిగా (పురుషులు, మహిళల విభాగంలో) ఆమె రికార్డు పుటల్లోకి ఎక్కింది. రొమేనియాలో జరుగుతున్న ఉమెన్స్ కాంటినెంటల్ కప్‌లో భాగంగా గ్రీస్‌తో జరిగిన టీ20 మ్యాచ్‌లో జోవాన్ హిక్స్ ఈ చారిత్రాత్మక ఫీట్ సాధించింది. ఈ మ్యాచ్‌లో.. ఆఫ్ స్పిన్నర్ అయిన హిక్స్, తన అద్భుత బౌలింగ్‌తో గ్రీస్ బ్యాటింగ్ ఆర్డర్‌ను కకావికలం చేసింది. కేవలం 10 పరుగులిచ్చి 5 కీలక వికెట్లు పడగొట్టింది. ఆమె ధాటికి గ్రీస్ జట్టు 15 ఓవర్లలో 52 పరుగులకే కుప్పకూలింది. అనంతరం బరిలోకి దిగిన ఐల్ ఆఫ్ మ్యాన్ జట్టు, కేవలం 6 ఓవర్లలో ఒక వికెట్ మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని సునాయాసంగా ఛేదించింది. ఈ ప్రదర్శనతో, జోవాన్నే హిక్స్ 1932లో ఆస్ట్రేలియాకు చెందిన బర్ట్ ఐరన్‌మాంగర్ నెలకొల్పిన రికార్డును అధిగమించింది. దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్టు మ్యాచ్‌లో ఐరన్‌మాంగర్ 49 ఏళ్ల వయసులో ఐదు వికెట్ల ప్రదర్శన చేసింది. అప్పటి నుంచి దాదాపు 94 ఏళ్లుగా ఈ రికార్డు ఎవరికీ సాధ్యం కాలేదు. ఇప్పుడు హిక్స్ ఆ రికార్డును తన పేరున లిఖించుకుంది.



అంతేకాకుండా, 50 ఏళ్లు దాటిన తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌లో 5 వికెట్లు తీసిన తొలి బౌలర్‌గా కూడా ఆమె నిలిచింది. విశేషమేమిటంటే, జోవాన్నే హిక్స్ 40 ఏళ్ల వయసులో మహిళల క్రికెట్ ఆడటం ప్రారంభించింది. అయినా పట్టుదలతో రాణిస్తూ ఐల్ ఆఫ్ మ్యాన్ జట్టులో కీలక బౌలర్‌గా ఎదిగింది. ఇప్పటివరకు 22 అంతర్జాతీయ టీ20 మ్యాచ్‌లు ఆడి 33 వికెట్లు పడగొట్టింది. అంతర్జాతీయ టీ20ల్లో ఆమెకు ఇది మూడో ఐదు వికెట్ల ప్రదర్శన కావడం గమనార్హం. ఆమె అసాధారణ ప్రతిభ, పట్టుదల ఎందరికో స్ఫూర్తినిస్తోంది.

## ఇతరులతో పోల్చుకోవద్దు- సెలక్టర్లే మిమ్మల్ని వెతుక్కుంటూ వస్తారు

జాతీయ జట్టులో చోటు కోసం ఎదురుచూస్తున్న యువ క్రికెటర్లకు భారత మాజీ టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ కీలక సందేశం ఇచ్చాడు. ఓపిక కోల్పోకుండా పరుగులు చేస్తూ ఉండాలని, తమ సన్నద్ధతపై నమ్మకం ఉంచాలని సూచించాడు. నిలకడగా రాణిస్తే సెలక్టర్లే మిమ్మల్ని వెతుక్కుంటూ వస్తారని, మీ బ్యాటే అన్నింటికీ సమాధానం చెబుతుందని భరోసా ఇచ్చాడు. ఎన్నో ఏళ్ల పాటు దేశవాళీ క్రికెట్‌లో శ్రమించి, ఆలస్యంగా భారత జట్టులోకి వచ్చి అగ్రశ్రేణి బ్యాటర్‌గా ఎదిగిన తన అనుభవాన్ని సూర్య యువతతో పంచుకున్నాడు. ఒక యువ క్రికెటర్ ప్రయాణంలో ఓపిక ఎంత ముఖ్యమో వివరిస్తూ, 'ఐఏఎన్ఎస్'తో సూర్యకుమార్ మాట్లాడాడు. "ప్రతి ఒక్కరి కథ వేరు, ప్రతి ఒక్కరి ప్రయాణం భిన్నం. అందుకే యువ క్రికెటర్లు ఇతరులతో తమను తాము పోల్చుకోవద్దని నేను చెబుతాను. నేను కూడా ఏళ్ల తరబడి ఏజ్-గ్రూప్, దేశవాళీ క్రికెట్ ఆడాను. కిట్ బ్యాగ్‌తో బస్సులు, రైళ్లలో ఎన్నో ప్రయాణాలు చేశాను. నా అవకాశం కోసం ఓపికగా ఎదురుచూశాను" అని తెలిపాడు. భారత క్రికెట్‌లో యువ ఆటగాళ్లపై ఉండే తీవ్రమైన ఒత్తిడిని సూర్యకుమార్ ప్రస్తావించాడు. "మన దేశంలో 21 లేదా 25 ఏళ్లకల్లా జట్టులో చోటు దక్కకపోతే కెరీర్ ముగిసిపోయినట్లేనని, మరో మార్గం చూసుకోవాలని చాలామంది భావిస్తారు. కానీ, నా దృష్టిలో వయసు అనేది గడువు కాదు, మీ సన్నద్ధతే అసలైన గడువు" అని పేర్కొన్నాడు. ఎవరూ గమనిం చనప్పుడు కూడా తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడంపైనే దృష్టి పెట్టాలని, కఠోర సాధనను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆపవద్దని సూచిం చాడు. సెలక్టర్ల దృష్టిని ఆకర్షించడానికి ప్రదర్శనలే అత్యంత శక్తిమంతమైన మార్గమని సూర్యకుమార్ అభిప్రాయపడ్డాడు. "క్రికెట్ పరంగా చెప్పాలంటే, మీరు పరుగులు చేస్తూ ఉంటే, మీ బ్యాటే సమాధానం చెబుతుంది. సెలక్టర్లు కచ్చితంగా మిమ్మల్ని గుర్తిస్తారు. మీరు ఉండాల్సిన సరైన స్థానానికి చేరుకుంటారు"



అని భరోసా ఇచ్చాడు. తోటి ఆటగాళ్లతో పోల్చుకుని ఆందోళన చెందే యువతకు సూర్యకుమార్ మాటలు స్ఫూర్తినిస్తున్నాయి. కలకు గడువు తేదీ ఉండదని, నిబద్ధతతో సిద్ధమైతే విజయం తప్పక వరిస్తుందని సూర్య తన కెరీర్ ద్వారా నిరూపించాడు.

# స్పోర్ట్స్

## ఇమ్రాన్ ఖాన్ కుమారుల ఇంటర్వ్యూ వివాదంపై
## నోరు విప్పిన పాకిస్థాన్ కోచ్ సర్ఫరాజ్ అహ్మద్



మాజీ ప్రధాని, పాకిస్థాన్ క్రికెట్ దిగ్గజం ఇమ్రాన్ ఖాన్ కుమారులను 'స్కై స్పోర్ట్స్' ఇంటర్వ్యూ చేయడంపై చెలరేగిన వివాదంపై పాకిస్థాన్ టెస్టు హెడ్ కోచ్ సర్ఫరాజ్ అహ్మద్ స్పందించారు. ఇంగ్లాండ్‌తో లార్డ్స్ మైదానంలో జరుగుతున్న రెండో టెస్టు మ్యాచ్ సందర్భంగా మీడియా సమావేశంలో దీనిపై ప్రశ్నించగా, ఆయన సమాధానం దాటవేస్తూ "నాకేమీ తెలియదు. మేము కేవలం మ్యాచ్‌పైనే దృష్టి పెట్టాం" అంటూ వ్యాఖ్యానించారు.ఇమ్రాన్ ఖాన్ కుమారులు సులేమాన్, కాసిమ్‌లను ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ మైఖేల్ అథర్టన్ లంచ్ బ్రేక్ సమయంలో ఇంటర్వ్యూ చేశారు. జైలులో ఉన్న ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యం, భద్రతపై వారు ఆందోళన వ్యక్తం చేసిన ఈ ఇంటర్వ్యూ టెలికాస్ట్ అవ్వడంపై పాకిస్థాన్ క్రికెట్ బోర్డు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ క్రమంలో మ్యాచ్ నుంచి వైదొలుగుతామని పీసీబీ హెచ్చరించిందనే వార్తలను సర్ఫరాజ్ తోసిపు చ్చారు. పీసీబీ నిరసనపై తమకు లేదా తమ ఆటగాళ్లకు ఎలాంటి సమాచారం లేదని, ఆ సమయంలో తామంతా లంచ్ చేస్తున్నామని ఆయన వివరణ ఇచ్చారు. ఇప్పటికే పీసీబీ ఈ ఇంటర్వ్యూ ప్రసారంపై స్కై స్పోర్ట్స్ యాజమాన్యానికి రాతపూర్వకంగా ఫిర్యాదు చేసింది. రాజకీయ ప్రాధాన్యత ఉన్న ఈ అంశం మ్యాచ్ వేళ కలకలం రేపినప్పటికీ, తమ దృష్టి మొత్తం కేవలం ఆటపైనే ఉందని సర్ఫరాజ్ అహ్మద్ స్పష్టం చేశారు.

VARTHAA SAKSHAMU
RNI Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం
Editor : SAGINALA RAVI KUMAR
తెలుగు దిన పత్రిక


# డబ్బు లేనివాడి కథ.. 'కింగ్ 100' పవర్‌ఫుల్ గ్లింప్స్ చూశారా

అక్కినేని అభిమానులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న 'కింగ్' నాగార్జున 100వ సినిమా సందడి అధికారికంగా మొదలైంది. నేడు నాగార్జున పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్‌తో పాటు ఫస్ట్ గ్లింప్స్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఎన్నో ఊహాగానాల మధ్య ఈ సినిమాకు 'కింగ్ 100' అనే టైటిల్‌ను ఖరారు చేస్తున్నట్లు ప్రకటించి, అభిమానులకు అదిరిపోయే కానుక ఇచ్చారు. 'మనుషుల్లో రెండు రకాలు.. ఒకటి డబ్బున్న వాళ్లు, మరొకటి డబ్బు లేని వాళ్లు' అనే పవర్‌ఫుల్ డైలాగ్‌తో విడుదలైన ఈ గ్లింప్స్ సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. గ్లింప్స్ చూస్తుంటే, డబ్బు లేని ఓ సాధారణ యువకుడు కసితో ఎదిగి, సమాజంలో 'కింగ్' స్థాయికి ఎలా చేరుకున్నాడు అనే ఆసక్తికరమైన కథాంశంతో సినిమా ఉండబోతున్నట్లు స్పష్టమవుతోంది. ఇందులో నాగార్జున యంగ్ వెర్షన్‌లోనూ కనిపించనుండగా, కథలో ఫాదర్ ఎమోషన్‌కు కూడా ప్రాధాన్యం ఉన్నట్లు తెలుస్తోంది. కొద్ది సెకన్ల వీడియోతోనే మేకర్స్ సినిమాపై భారీ హైప్ క్రియేట్ చేయడంలో సక్సెస్ అయ్యారు. ఈ ప్రాజెక్ట్‌లో మరో ప్రధాన ఆకర్షణ టబు. చాలా సంవత్సరాల తర్వాత నాగార్జున, టబు కలిసి నటిస్తుండటంతో ఈ కాంబినేషన్‌పై ప్రత్యేక ఆసక్తి నెలకొంది. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన 'నిన్నే పెళ్లాడుతా', 'ఆవిడా మా ఆవిడే' వంటి చిత్రాలు హిట్లుగా నిలిచాయి. ఇప్పుడు 'కింగ్ 100'లో టబు పాత్ర కథను మలుపు తిప్పేంత కీలకంగా ఉండబోతుందని సమాచారం. తమిళంలో 'నితమ్ ఒరు వానమ్' వంటి చిత్రంతో గుర్తింపు




పొందిన రా కార్తీక్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై అక్కినేని కుటుంబం ఈ చిత్రాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తోంది. రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తుండటం సినిమాకు మరో బలం. అన్ని హంగులతో రూపొందుతున్న ఈ చిత్రాన్ని డిసెంబర్ 24న క్రిస్మస్ కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకు రానున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు.

## మంగ్లీని కాపాడుతున్న ఆ కేంద్ర మంత్రి ఎవరు?: అడ్వకేట్ సుబ్బు

మైక్రో ఫైనాన్స్ కేసు వివాదంలో ప్రముఖ గాయని మంగ్లీ చుట్టూ ముసురుకున్న ఆరోపణల వ్యవహారం మరింత తీవ్రరూపం దాలుస్తోంది. మంగ్లీతో తాను రాజీ పడినట్లు సోషల్ మీడియాలో వస్తున్న వార్తలను న్యాయవాది సుబ్బు ఖండించారు. ఈ మేరకు ఆయన ఒక వీడియో విడుదల చేస్తూ... కేసు ఉపసంహరణ కోసం మంగ్లీ మనుషుల నుంచి రూ. కోట్లలో ఆఫర్ వచ్చిందని, కానీ తాను దానిని తిరస్కరించిన విషయం ప్రజలందరికీ తెలుసని అన్నారు.కోర్టుల్లో మంగ్లీపై తాను వేసిన పిటిషన్లతో పాటు, తనపై మంగ్లీ చేసిన నిరాధారమైన ఫిర్యాదుల కేసులు ఇప్పటికీ విచారణలోనే ఉన్నాయని సుబ్బు స్పష్టం చేశారు. తీవ్రమైన అక్రమ ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తికి అమెరికాలోని ఎన్నారై తెలుగు నిర్వాహకులు అంతర్జాతీయ వేదికలపై ఎలా అవకాశాలు ఇస్తారని ప్రశ్నించారు. కేసులో నిజానిజాలు తేలేవరకు ఆమెకు విదేశీ షోలలో అవకాశాలు ఇవ్వకూడదని, ఈ విషయమై ఇప్పటికే ఫిల్మ్ ఛాంబర్‌లోనూ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.బాధితుల పక్షాన నిలబడ్డ తమను ఊరు దాటవద్దని పోలీసులు ఆంక్షలు విధిస్తుంటే, నిందితురాలిగా ఉన్న మంగ్లీ స్వేచ్ఛగా విదేశాలకు ఎలా వెళ్తోందని నిలదీశారు. ఆమె అరెస్ట్ కాకుండా వెనుకుండి కాపాడుతున్న ఆ కేంద్ర మంత్రి ఎవరో ప్రజలే సోషల్ మీడియా వేదికగా ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. అంతేకాకుండా, ఈ కేసులో కీలక సాక్షి అయిన డ్రైవర్ ఏమయ్యాడు? అతడిని మంగ్లీతో లాలూచీ చేయించింది ఎవరు? అని సంచలన ప్రశ్నలు గుప్పించారు. బాధితులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగేదే లేదని స్పష్టం చేశారు.



## ప్రెగ్నెన్సీపై సమంత ఓపెన్ టాక్.. ఎన్ని కిలోలు పెరిగిందో తెలిస్తే షాక్ అవుతారు!

ప్రముఖ నటి సమంత రూత్ ప్రభు ప్రస్తుతం తన గర్భధారణ కాలాన్ని పూర్తిస్థాయిలో ఆస్వాదిస్తున్నారు. ఈ ప్రయాణంలోని ప్రతి దశను, తన అనుభవాలను అభిమానులతో, కాబోయే తల్లులతో పంచుకుంటున్నారు. తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో 'ఆస్క్ మీ ఎనీథింగ్' సెషన్ నిర్వహించిన ఆమె, తన ప్రెగ్నెన్సీకి సంబంధించిన ఎన్నో ఆసక్తికర విషయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆమె కొత్త తల్లులు, గర్భవతులతో ముచ్చటించారు. "బిడ్డ కోసం అవసరమైన వస్తువులన్నీ కొన్నాను. కానీ, ఇప్పుడు వాటిని చూస్తుంటే కాస్త భయంగా ఉంది" అంటూ సమంత తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఈ సెషన్‌లో ఒక అభిమాని గర్భధారణ సమయంలో బరువు పెరగడం గురించి ప్రస్తావించగా, సమంత బదులిస్తూ.. "మీ బాధ నాకు అర్థమైంది. నేను ఇప్పటికే 11 కిలోలు పెరిగాను" అని తెలిపారు. మరో అభిమాని "బాగా నిద్రపోండి, మీ జీవితం పూర్తిగా మారిపోబోతోంది" అని సలహా ఇవ్వగా, సమంత ఆసక్తికరంగా స్పందించారు. ఇటీవలే తల్లిగా మారిన ఓ యువతి తన దినచర్య గురించి వివరిస్తూ.. "నా బిడ్డకు పాలు పట్టడం, త్రేన్పు తెప్పించడం, జోల పాడటం.. ఇదే రిపీట్ అవుతోంది" అని చెప్పగా, "అది వింటుంటేనే ఒక ఫుల్ టైమ్ ఉద్యోగంలా అనిపిస్తోంది" అని సమంత అన్నారు. బిడ్డకు ఏం పేరు పెట్టాలనుకుంటున్నారని ఒకరు అడగ్గా.. "ఇది నేను ఊహించిన దానికంటే చాలా కష్టంగా ఉంది. బహుశా దీనికి మీ సహాయం అవసరమవుతుంది అనుకుంటున్నాను" అని బదులిచ్చారు.



# ఓటీటీలోకి లోకేశ్ కనగరాజ్ బ్లాక్ బస్టర్ మూవీ 'డిసి'- స్ట్రీమింగ్ డేట్ ఫిక్స్

కోలీవుడ్ ప్రముఖ దర్శకుడు లోకేశ్ కనగరాజ్ హీరోగా పరిచయమైన చిత్రం 'డిసి'. ఆగస్టు 7న థియేటర్లలో విడుదలై బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచిన ఈ సినిమా ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 4 నుంచి ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ సన్ నెక్స్ట్‌లో స్ట్రీమింగ్ చేయనున్నట్లు అధికారికంగా ప్రకటిం చారు. తమిళంతో పాటు తెలుగు, మలయాళ భాషల్లోనూ ఈ సినిమా అందుబాటులో ఉండ నుంది. 'దేవదాసు' కథకు ఆధునిక డార్క్ టచ్ ఇస్తూ, దర్శకుడు అరుణ్ మాదేశ్వరన్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. సన్ పిక్చర్స్ నిర్మించిన ఈ సినిమాకు అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిం చారు. థియేటర్లలో విడుదలైన అనతికా లంలోనే ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన రాబట్టు కుంది. ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ వద్ద రూ.101 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించి, లోకేశ్ కనగరాజ్‌కు నటుడిగా ఘనమైన ఆరంభాన్ని అందించింది. ఈ సినిమాలో లోకేశ్ కనగరాజ్ దేవదాస్/దాస్ పాత్రలో అద్భుతమైన నటన కనబరిచారని విమర్శకుల నుంచి ప్రశంసలు అందాయి. అతడి సరసన వామికా గబ్బి, సంజనా కృష్ణమూర్తి కీలక పాత్రల్లో నటించారు. థియేటర్లలో భారీ విజయం సాధించిన ఈ చిత్రం, ఇప్పుడు ఓటీటీలోనూ ప్రేక్షకులను ఆకట్టుకోనుంది. డాల్బీ విజన్, హెచ్ డీఆర్ 10ం, డాల్బీ అట్మాస్ వంటి అత్యాధునిక సాంకేతిక ఫీచర్లతో 'డిసి' చిత్రాన్ని ఇంట్లోనే వీక్షించే అవకాశం కలగనుంది. సన్ నెక్స్ట్‌తో పాటు అమెజాన్ ప్రైమ్ వీడియోలో కూడా ఈ సినిమా అదే రోజున స్ట్రీమింగ్




కావచ్చని ప్రచారం జరుగుతోంది.

PRINTED ,PUBLISHED ,OWNED BY VARTHAA SAKSHAMU NEWS .Regd no:APTEL/25/A5153, EDITOR :S.RAVI KUMAR, 32-3-1, SPG PALEM, ATMAKURU, KURNOOL ANDHRAPRADESH,-518422.